

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 26-12-2024 | సంపుటి - 21 | సంచిక -249 | రూ : 4 | పేజీలు: 8




## హిమాచల్‌లో భారీ మంచు

- నలుగురు మృతి, 223 రహదారులు మూసివేత
- మనాలీకి పర్యాటకుల తాకిడి
- అప్రమత్తంగా ఉండాలని హిమాచల్ ప్రభుత్వం హెచ్చరిక

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో గత 24 గంటల్లో భారీగా మంచు కురియడంతో నలుగురు మృతి చెందారు. మూడు జాతీయరహదారు లు, మరో 220 దారులను మూసివేశారు. సిమ్లా, కులు, మండి, చంబా, సిర్మౌర్ జిల్లాలతో పాటు కిన్నౌర్, లాహౌల్, స్పితి జిల్లాల్లో భారీగా మంచు కురిసింది. పలు వాహనాలు అదుపుతప్పి బోల్తా పడటంతో నలుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. దీంతో సిమ్లాలో 145, కులులో 25, మండీ జిల్లాల్లో 20 రహదారులను మూసివేశారు. 356 ట్రాన్స్ ఫార్మర్ ఫెయిల్యూర్ కావడంతో చాలా ప్రాంతాల్లో విద్యుత్ లేదు. క్రిస్మస్, న్యూ ఇయర్ కోసం సిమ్లా, మనాలీలకు పర్యాటకులు పోటెత్తారు. స్థానిక నివేదికల ప్రకారం, అట్టారి నుంచి లేహ్, కులు జిల్లా లోని సంజ్ నుంచి ఔట్, కిన్నౌర్ జిల్లాలోని ఖాబ్ సంగం, లాహౌల్, స్పితి జిల్లాలోని గ్రామ్ ఫూ వరకు జాతీయ రహదారులు ట్రాఫిక్ కారణంగా మూసివేశారు. రోడ్లను క్లియర్ చేయడానికి హిమాచల్ ప్రభుత్వం రెండు స్నోబ్లోయర్లతో సహా 268 యంత్రాలను ఏర్పాటు చేసింది. జిల్లా యంత్రాంగం సూచనలను పాటించాలని, స్థానికులు చెప్పేది వినాలని, మంచులో డ్రైవింగ్ చేయవద్దని పర్యాటకులు సూచించింది.

**తెల్లని వండర్‌ల్యాండ్‌గా హిమాచల్..**

హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లా, మనా లీ వంటి పర్యాటక కేంద్రాలు తెల్లని వండర్‌ల్యాండ్‌గా మారాయి. అలాగే జమ్మూకాశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో తాజాగా మంచుకురిసింది. ఉష్ణోగ్రతలు గడ్డకట్టే స్థాయి కంటే అనేక డిగ్రీలు పడిపోయా యి. ఇది క్రిస్మస్ సెలవుల కోసం ప్రదేశాలను సందర్శించే పర్యాటకులకు ఉత్సాహాన్ని కలిగిస్తోంది. మరోవైపు వాహనాల రాకపోకలకు కష్టమవుతోంది. సోమవా రం అర్ధరాత్రి మనాలీ, డల్హౌసీ శివారు ప్రాంతాల్లో తేలికపాటి హిమపాతం నమోదైంది.

తరువాయి 2లో

# కేంద్ర గ్రాంట్ల దుర్వినియోగం

- గ్రామీణాభివృద్ధి నిధుల పక్కదారిపై
- రాష్ట్రాలను తప్పుబట్టిన పార్లమెంటరీ కమిటీ



న్యూఢిల్లీ, డిసెంబరు 25: గ్రామీణాభివృద్ధి కోసం పంచాయతీరాజ్ సంస్థలకు కేంద్రం మంజూరుచేసిన గ్రాంట్ల వినియోగంలో రాష్ట్రాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని పార్లమెంటరీ కమిటీ తప్పుబట్టింది. రాష్ట్రాల్లో గ్రాంట్ల నిర్వహణ, నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణ, ఆర్థిక నివేదికల రూపకల్పనలో తీవ్రమైన లోపాలున్నాయని కమిటీ గుర్తించింది. ఈ మేరకు రూపొందించిన నివేదికను కమిటీ ఇటీవల కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖకు సమర్పించింది. ఈ నెల మొదట్లో ఆ నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అప్రాధాన్య అంశాలకు నిధులను మళ్లించడం, నిధుల వినియోగంలో పారదర్శకత లేకపోవడంపై కమిటీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది.

తరువాయి 2లో

# కాంగ్రెస్.. శంకుస్థాపనల స్పెషలిస్ట్!



- ప్రాజెక్టులు 35-40 ఏళ్లు ఆలస్యం
- మధ్యప్రదేశ్‌లో ప్రధాని మోదీ ధ్వజం
- నదుల అనుసంధాన ప్రాజెక్టుకు శంకుస్థాపన

ఖజురహో, డిసెంబరు 25: గత కాంగ్రెస్ ప్రభుత్వాలపై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడంలో ఆ పార్టీ స్పెషలిస్టు అని ఎద్దేవా చేశారు. పునాది రాళ్లు వేసినా.. ప్రాజెక్టులను 3540 ఏళ్లు ఆలస్యం చేసిందని.. ఉత్తుత్తి ప్రకటనలు మాత్రమే చేస్తుందని.. ప్రజాప్రయోజనాలు దానికి పట్టవని ధ్వజమెత్తారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలో కెన్ బెత్వా నదుల అనుసంధానానికి ఆయన శంకుస్థాపన చేశారు. దేశంలో జలసంరక్షణ చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని.. ముఖ్యంగా బుందేల్‌ఖండ్ వంటి ప్రాంతాల్లో రైతుల అవసరాలను గుర్తించడంలో విఫలమయ్యాయని ఈ సందర్భంగా జరిగిన సభలో చెప్పారు. అంబేద్కర్‌ను అమిత్‌షా అవమానించారంటూ

తరువాయి 2లో

# తరుముకొస్తున్న ఉత్పాతం

- త్వరలో భారీ అగ్నిపర్వత విస్ఫోటం
- ప్రపంచానికి పెను ఇక్కట్లే: సైంటిస్టులు
- ఉష్ణోగ్రతల్లో తీవ్ర హెచ్చుతగ్గులు
- భారీగా పడిపోనున్న ఆహారోత్పత్తి

అమెరికాలో అతి పెద్దదైన కిలోవెయా అగ్నిపర్వతం సోమవారం బద్దలైంది. విస్ఫోటనం ధాటికి అగ్నిపర్వతం నుంచి ఏకంగా 80 మీటర్ల ఎత్తుకు పైగా లావా ఎగసిపడుతోంది. ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని, అతి త్వరలో అంతకు మించి భారీ స్థాయిలో అగ్నిపర్వత విస్ఫోటం తప్పకపోవచ్చని జియాలజిస్టులు అంచనా వేస్తున్నారు. ''అదెక్కడన్నది ఇప్పటికిప్పుడు స్పష్టం కావడం లేదు. కానీ ముప్పు పొంచి ఉందన్నది మాత్రం సుస్పష్టం''అని చెబుతున్నారు. దాని దెబ్బకు ప్రపంచమంతా అతలాకుతలం కావడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. పర్యావరణ సమస్యలు మొదలుకుని ఆహార కొరత దాకా మానవాళికి కొన్నేళ్ల పాటు అన్నివిధాలా కనీవినీ ఎరగని కష్టనష్టాలు తప్పకపోవచ్చంటున్నారు. ప్రపంచంలో

తరువాయి 2లో



# కోచింగ్ 'కోట'కు బీటలు

- కోటాలోని కోచింగ్ సెంటర్లలో 40% మేర తగ్గిన ప్రవేశాలు



2లో




## తప్పడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

- సోషల్ మీడియాలో పోస్టులపై పోలీసుల హెచ్చరిక
- అల్లు అర్జున్ రాకముందే తొక్కిసలాట జరిగిందంటూ అపోహలకు గురిచేసేలా వీడియోలు
- ఉద్దేశపూర్వకంగా తప్పడు సమాచారం వ్యాప్తి: పోలీస్ శాఖ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 25: సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ నగర పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికల్లో కొంతమంది ఈ ఘటనకు సంబంధించి పోలీసుల నిర్లక్షం ఉందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ప్రజలను అపోహలకు గురిచేసేలా వీడియోలు, సమాచారం పోస్ట్ చేస్తే కఠిన

తరువాయి 2లో

## డీజిల్ బస్సుకు ఎలక్ట్రిక్ రూపు

- ఎలక్ట్రిక్ బస్సులుగా పాత డీజిల్ బస్సులు
- మార్చేందుకు ఆర్టీసీ మళ్లీ ప్రయత్నాలు
- రెండేళ్ల నాటి ప్రణాళికకు తిరిగి ప్రాణం
- రెట్రో ఫిట్‌మెంట్ పాలసీ కోసం కేంద్రానికి లేఖ
- తక్కువ ఖర్చుతో ఎలక్ట్రిక్ బస్సులు లభిస్తాయని సూచన




హైదరాబాద్: ఖర్చులు తగ్గించుకొనేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) అన్ని మార్గాలను వెదుకుతోంది. ఇంధన భారం తడిసి మోపెడవుతుండటంతో ఇప్పటికే ఎలక్ట్రిక్ బస్సుల వైపు మొగ్గుచూపింది. ఆ బస్సులుఖరీదైనవి కావటంతో అద్దెకు తీసుకొని నడుపుతోంది. అదే సమయంలో సంస్థకు గుదిబండగా మారుతున్న పాత డీజిల్ బస్సులనూ ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. రెట్రో ఫిట్‌మెంట్ టెక్నాలజీ ద్వారా పాత

తరువాయి 2లో

## మనూ భాకర్‌కు ఖేల్‌రత్న?

- జాబితాలో చేర్చనున్న క్రీడా శాఖ

న్యూఢిల్లీ: ఈ ఏడాది ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు జాబితాలో స్టార్ షూటర్ మనూ భాకర్ పేరు లేకపోవడం పెద్ద వివాదం సృష్టించింది. ఈ నేపథ్యంలో కేంద్ర క్రీడా శాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టినట్టు తెలిసింది. ఖేల్‌రత్న పురస్కారాల నామినేటెడ్ జాబితాలో మనూ భాకర్ పేరు చేర్చనున్నట్టు ఆ శాఖ వర్గాలు బుధవారం వెల్లడించాయి. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ రామసుబ్రమణియన్ నేతృత్వంలోని 12 మంది సభ్యుల కమిటీ క్రీడా అవార్డులకు అథ్లెట్లను ఎంపిక చేయనుంది. ఇక ఈసారి ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారిస్ పారా ఒలింపిక్స్ హైజంప్‌లో స్వర్ణం నెగ్గిన ప్రవీణ్ కుమార్ తదితరుల పేర్లను సిఫారసు చేశారు.



# కేంద్ర గ్రాంట్ల దుర్వినియోగం

(మొదటిపేజీ తరువాయి)

15వ ఆర్థిక సంఘం(2021 2026) సిఫారసుల ఆధారంగా కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పంచాయతీరాజ్ సంస్థలు టైడ్, అన్‌టైడ్ గ్రాంట్లు పొందుతున్నాయి. 2026 మార్చి 31 నాటికి ఈ గ్రాంట్లు ముగిగిపోతాయి. టైడ్ గ్రాంట్లను శానిటేషన్, తాగునీటి సరఫరా, వర్షం నీటి సేకరణ, నీటి రీసైకిలింగ్, బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడం తదితర నిర్దిష్ట ప్రాథమిక పనులకు వినియోగిస్తారు. అన్‌టైడ్ గ్రాంట్లను రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్‌లో పేర్కొన్న 29 రకాల పనులకు వినియోగిస్తారు. అయితే, టైడ్ గ్రాంట్ల కింద విడుదలైన నిధుల్లో గతనెల 21 నాటికి దాదాపు 45u వరకు యూపీ వినియోగించుకోలేకపోయిందని కమిటీ తెలిపింది. అలాగే, మహారాష్ట్రకు విడుదలైన రూ.7,276 కోట్లలో రూ.5,023 కోట్లు ఇంకా వినియోగం కాలేదని తెలిపింది. తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు నిధులను భారీగా అప్రాధాన్య అంశాలకు మళ్లించేశాయని తెలిపింది. ఆడిట్‌లలో తెలంగాణ(12,129 కేసులు), యూపీ(19,732 కేసులు) వెలుగుచూడటం పారదర్శకతలేమిని ఎత్తిచూపుతోందని పేర్కొంది.

# కాంగ్రెస్.. శంకుస్థాపనల స్పెషలిస్ట్!

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యమిస్తున్న కాంగ్రెస్‌పై మండిపడ్డారు. దేశ జలసంరక్షణ విధానాల రూపకల్పనలో అంబేద్కర్ పాత్ర చాలా ఉందని, నేడు కేంద్ర జలసంఘం ఉనికి ఉందంటే ఆయన చొరవ, దూరదృష్టే కారణమని చెప్పారు. ఆయన కృషిని కాంగ్రెస్ ఏనాడూ గుర్తించలేదని, ఆయనకు ఇవ్వాల్సినంత క్రెడిట్ ఇవ్వలేదని ఆక్షేపించారు. 'అధికారం తన జన్మహక్కు అని కాంగ్రెస్ భావిస్తుంది. కానీ సత్పరిపాలన అందించడంలో విఫలమైంది. శంకుస్థాపనలు చేసిన తర్వాత దశాబ్దాలపాటు ప్రాజెక్టుల జోలికి వెళ్లలేదు. కాంగ్రెస్, ప్రభుత్వం కలిసి సాగవు' అని వ్యాఖ్యానించారు. నీటి కొరతను నివారించడానికి నదుల అనుసంధాన ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఈ 21వ శతాబ్దిలో సమృద్ధిగా నీరు, నీటి ప్రాజెక్టుల సమర్థ నిర్వహణ ఉన్న దేశాలే ముందుకెళ్తాయన్నారు. మధ్యప్రదేశ్‌లో గ్రామీణాభివృద్ధి కోసం 1,153 అటల్ గ్రామ సేవాసదన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ బెత్వా, కెన్ నదుల జలాలను రెండు కలశాల్లో ఆయనకు అందజేశారు. ఆ నీటితో అనుసంధాన ప్రాజెక్టు నమూనాను ఆయన అభిషేకించారు.

**వాజపేయికి ప్రధాని నివాళి**

మాజీ ప్రధాని వాజపేయి శత జయంతి సందర్భంగా బుధవారం ఢిల్లీలోని 'సదైవ్ అటల్' (వాజపేయి స్మారకం పేరు) వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, ప్రధాని మోదీ తదితర ప్రముఖులు నివాళులర్పించారు. వాజపేయి రాజ్యాంగ విలువలకు కట్టుబడిన తీరు ఎల్లకాలం గుర్తుండిపోతుందని మోదీ ఈ సందర్భంగా అన్నారు. సదైవ్ అటల్ వద్ద వాజపేయికి నివాళులర్పించిన వారిలో ఏపీ సీఎం చంద్రబాబు కూడా ఉన్నారు. వాజపేయి దూరదృష్టి వల్లే భారత్ ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందని ఆయన అన్నారు.

# కోచింగ్ 'కోట'కు బీటలు

కోటా.. జాతీయస్థాయిలో పేరొందిన కోచింగ్ సెంటర్ల కేంద్రం! నీట్, యూపీఎస్సీ, ఐఐటీ జేఈఈ.. తదితర ప్రవేశపరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలనుకునే విద్యార్థుల తొలి గమ్యస్థానం!!

కానీ.. లక్షలాది మంది విద్యార్థులతో కళకళలాడిన కోటా ఇప్పుడా పూర్వవైభవాన్ని కోల్పోయింది! విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య పెరుగుతుండడంతో.. అక్కడి శిక్షణ కేంద్రాల్లో కొత్తగా చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. నిరుటితో పోలిస్తే ఈ ఏడాది ఆ సంఖ్య 3040u మేర పడిపోయింది. ఆ ప్రభావం.. హాస్టళ్లు, మెస్‌లు, ఇతర చిరువ్యాపారాలపై తీవ్రంగా పడుతోంది!! రద్దీ లేని రోడ్లు.. ఎటు చూసినా 'అద్దెకు', 'అమ్మకానికి' అనే బోర్డులు.. ఇదీ ఇప్పుడు అక్కడి పరిస్థితి!!

**తీవ్ర సంక్షోభంలోకి హాస్టళ్లు**

చిరు వ్యాపారులపైనా ప్రభావం

ఐదో వంతుకు పడిపోయిన అద్దెలు

కోటా, డిసెంబరు 25: విద్యార్థులను వారి జ్ఞానంతో కాకుండా.. బట్టీపట్టడం ద్వారా వచ్చే మార్కులతో, ర్యాంకులతో మాత్రమే కొలిచే సమాజం మనది. అలాంటి చదువుల'బట్టీ'లకు పేరొందిన నగరం.. రాజస్థాన్‌లో మూడో అతిపెద్ద నగరమైన కోటా. కండరాలు క్షీణించే (మస్క్యులర్ డిస్ట్రోఫీ) వ్యాధితో చక్రాల కుర్చీకే పరిమితమైన వినోద్ కుమార్ బన్సల్ అనే ఐఐటీ పట్టభద్రుడు.. 1991లో ఎనిమిది మంది విద్యార్థులకు తన ఇంట్లో డైనింగ్ టేబుల్ వద్ద మొదలు పెట్టిన శిక్షణ కోటాలో కోచింగ్ కేంద్రాల విస్ఫోటానికి కేంద్ర బిందువు. ఆయన దగ్గర శిక్షణ పొందిన ప్రమోద్ మహేశ్వరి అనే మరో ఐఐటీ పట్టభద్రుడు 'కెరీర్ పాయింట్' పేరుతో మరో కోచింగ్ కేంద్రాన్ని ప్రారంభించాడు. అలా ఒకదాని తర్వాత ఒకటిగా వందల సంఖ్యలో కోచింగ్ సెంటర్లు పుట్టుకురావడంతో కోటా దేశంలోనే అతిపెద్ద 'ప్రవేశ పరీక్షల శిక్షణ కేంద్రం'గా మారిపోయింది. ఎలెన్, రెజొనెన్స్, మోషన్, అన్‌అకాడమీ, ఫిజిక్స్‌వాలా, ఆకాశ్, సర్వోత్తమ్.. ఇలా జాతీయస్థాయిలో పేరొందిన కోచింగ్ దిగ్గజాలతోపాటు చిన్నాచితకా శిక్షణ కేంద్రాలతో దాదాపు రెండున్నర దశాబ్దాలుగా కళకళలాడుతూ వస్తున్న కోటా నగరం ఈ ఏడాది చిన్నబోయింది. కోటాలో విద్యార్థుల ఆత్మహత్యల గురించి విస్తృతంగా ప్రచారం జరగడం, కోచింగ్ సెంటర్లను నియంత్రిస్తూ ఈ ఏడాది జనవరిలో కేంద్ర సర్కారు తీసుకొచ్చిన కొత్త మార్గదర్శకాలు, ప్రముఖ కోచింగ్ సెంటర్లు దేశవ్యాప్తంగా తమ శాఖలను విస్తరించడం.. ఇలా రకరకాల కారణాల వల్ల కోటాకు వచ్చే విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది బాగా తగ్గిపోయింది.

అంకెల్లో చెప్పాలంటే.. సాధారణంగా కోటాకు ఏటా దాదాపు లక్షన్నర నుంచి రెండు లక్షల మంది దాకా విద్యార్థులు.. వివిధ ప్రవేశపరీక్షలకు సంబంధించిన శిక్షణ నిమిత్తం వస్తుంటారు. కానీ, ఈ ఏడాది ఆ సంఖ్య దాదాపు 85 వేల నుంచి లక్ష దాకా మాత్రమే ఉన్నట్టు సమాచారం. కోచింగ్ సెంటర్ల వల్ల అక్కడ జరిగే వ్యాపారం కిందటి సంవత్సరంగా దాకా ఏడాదికి రూ.6,500 కోట్ల నుంచి రూ.7 వేల కోట్ల దాకా ఉండేది. అది ఈ ఏడాది రూ.3,500 కోట్లకు పడిపోయింది!! కోచింగ్ సెంటర్లే కాదు.. విద్యార్థుల కోసం నిర్మించిన వేలాది హాస్టళ్లు సైతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. కోటా నగరం మొత్తమ్మీదా ఇలా విద్యార్థుల కోసం నిర్మించిన హాస్టళ్లు 4,500 దాకా ఉంటాయని అంచనా. ఒకప్పుడు విద్యార్థులతో నిండిపోయి కళకళలాడిన ఈ హాస్టళ్లన్నీ.. ఇప్పుడు 4050 శాతం ఆక్యుపెన్సీ కూడా లేక వెలవెలబోతున్నాయి. బ్యాంకుల్లో అప్పులు తీసుకుని హాస్టళ్లు నిర్మించి వాటిని నడిపినవారు.. ఇప్పుడు విద్యార్థులు లేక, రాబడి రాక.. బ్యాంకులకు నెలవారీ చెల్లింపులు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. కిందటి సంవత్సరం దాకా నెలకు రూ.15 వేలు వసూలు చేసిన హాస్టళ్లు.. ఇప్పుడు రూ.9 వేలకే అన్ని సౌకర్యాలూ కల్పించడానికి సిద్ధమైనా పూర్తిగా నిండని పరిస్థితి నెలకొంది. అలాగే.. ఈ కోచింగ్ సెంటర్లపై ఆధారపడి జీవనం సాగించే జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలవారు, ఆటో డ్రైవర్లు, హోటళ్లు, మెస్‌ల యజమానులు, వాటిలో పనిచేసే సిబ్బంది.. ఇలా లక్షలాదిమందిపై ఈ సంక్షోభం తీవ్ర ప్రభావం చూపుతోంది. అలాగే దుకాణాల అద్దెలు రూ.15 వేల నుంచి రూ.3 వేలకు పడిపోయాయి. అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కోటాకు విద్యార్థుల రాక తగ్గిపోయి ఆ ప్రభావం స్థానిక ఆర్థిక వ్యవస్థపై పడడంతో.. అక్కడి వ్యాపారులు ఐటీ పరిశ్రమపై దృష్టి సారించారు.రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం కోటాలో 2023లో ఆత్మహత్య చేసుకుని చనిపోయిన విద్యార్థుల సంఖ్య ఇది. 2022లో ఈ సంఖ్య 15 కాగా.. 2019లో 18 మంది, 2018లో 20 మంది, 2017లో ఏడుగురు, 2016లో 17 మంది, 2015లో 18 మంది చనిపోయారు. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా కారణంగా కోటాలోని కోచింగ్ సెంటర్లన్నీ మూతపడడంతో ఆ రెండేళ్లూ విద్యార్థులు క్షేమంగా ఉన్నారు.

**అలా మొదలైంది..**

1994లో.. కోటాలోని కోచింగ్‌సెంటర్లకు చెందిన 15 మంది విద్యార్థులకు ఐఐటీల్లో ప్రవేశం లభించడంతో ఆ నగరం పేరు దేశవ్యాప్తంగా మారుమోగిపోయింది. ఆ తర్వాత ఏడాది ఏకంగా 51 మంది ఐఐటీల్లో సీట్లు సాధించడంతో.. అందులో ఐదుగురు టాప్100లో చోటు సాధించారు. 2000 సంవత్సరంలో.. ఐఐటీల్లో సీట్లు సాధించిన టాప్10లో ముగ్గురు (1, 2, 7 ర్యాంకులు) కోటా విద్యార్థులే కావడంతో.. అక్కడి కోచింగ్ సెంటర్లకు దేశం నలుమూలల నుంచి విద్యార్థులు వెల్లువెత్తడం మొదలైంది.

# తరుముకొస్తున్న ఉత్పాతం

(మొదటిపేజీ తరువాయి)

ఏదో ఒక మూలన జరిగే అగ్నిపర్వత పేలుడు మొత్తం ప్రపంచాన్ని ఇంతగా ఎలా ప్రభావితం చేస్తుందంటే నమ్మశక్యంగా అనిపించకపోవచ్చు. కానీ, వినడానికి ఆశ్చర్యంగా అనిపించినా పచ్చి నిజమిది''అని సైంటిస్టులు చెబుతున్నారు...!

అది 1815. ఇండోనేసియాలోని మౌంట్ తంబోరా అగ్నిపర్వతం ఉన్నట్టుండి బద్దలైంది. ఎంతలా అంటే, మానవాళి చరిత్రలో ఇప్పటిదాకా నమోదైన అతి భారీ విస్ఫోటంగా అది రికార్డుల్లో నిలిచిపోయింది. ఆ తీవ్రత ధాటికి భారీ పరిమాణంలో ఎగిసిపడ్డ దుమ్ము, ధూళి రేణువులు తదితరాలు వాతావరణంలో కిలోమీటర్ల ఎత్తున, అత్యంత విస్తారంగా పరుచుకుపోయాయి. భూమిని చేరే సూర్యరశ్మిని అవి అడ్డుకున్నాయి. దాంతో ఉత్తరార్ధ గోళంలో ఉష్ణోగ్రతలు ఏకంగా ఒక డిగ్రీకి పైగా పడిపోయాయి. ఆ ఏడాది ఆ ప్రాంతంలో ఎక్కడా వేసవే లేకుండా పోయింది. ఫలితంగా వానలు ముఖం చాటేయడంతో పంటలు తీవ్రంగా దెబ్బతిని దిగుబడి భారీగా తగ్గిపోయింది. దేశాలకు దేశాలే తిండికి అలమటించిపోయాయి. ఎటు చూసినా కరువు మరణాలే అన్నట్టుగా తయారైంది. వాతావరణ మార్పుల కారణంగా కలరా వంటి మహమ్మారులు విజృంభించి మరింత భారీ ప్రాణ నష్టానికి కారణమయ్యాయి. ఇదంతా కేవలం ఒకే ఒక్క అగ్నిపర్వత విస్ఫోటం చేసిన నష్టం. అందుకే, త్వరలోనే అలాంటి విస్ఫోటానికి ప్రకృతి రంగం సిద్ధం చేసుకుంటోందన్న జియాలజిస్టుల హెచ్చరికలు వణుకు పుట్టిస్తున్నాయి. అందుకు ఆరింట ఒక శాతం అవకాశమున్నట్టు జెనీవా యూనివర్సిటీ పర్యావరణ శాస్త్రవేత్త మార్కస్ స్టొఫెల్ అంచనా వేశారు. ''ఈసారి జరగబోయే పర్యావరణ విధ్వంసం అంచనాకు కూడా అందనిది. పైగా ఈ విపత్తును ఎదుర్కోవడానికి మన దగ్గర ఎలాంటి ప్రణాళికా లేకపోవడం మరింత గుబులు పుట్టించే అంశం''అంటూ వాపోయారు. అంతేకాదు, ''1815తో పోల్చుకుంటే ఈసారి జరగబోయే నష్టం అంచనాలకు కూడా అందని స్థాయిలో ఉంటుంది''అని అభిప్రాయపడ్డారు.

**ఏం జరుగుతుంది?**

అగ్నిపర్వతాలు బద్దలైనప్పుడు భారీగా లావాను వెదజల్లుతాయన్నది తెలిసిందే. దాంతోపాటు అత్యంత భారీ పరిమాణంలో బూడిదతో పాటు పలు రకాల వాయువులు కూడా విడుదలవుతాయి. వాటిలో సల్ఫర్ డయాక్సైడ్ చేసే హాని అంతా ఇంతా కాదు. పేలుడు తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నప్పుడు ఇది ఏకంగా వాతావరణానికి మాతృ స్థానమైన ట్రోపోస్పియర్ దాకా చేరుతుంది. దాని దిగువన, అంటే భూమికి దాదాపు 7 మైళ్ల ఎత్తున ఉండే స్ట్రాటోస్పియర్‌లో భారీగా పరుచుకుని ఏరోసెల్ అణువుల పుట్టుకకు దారితీస్తుంది. అవి సూర్యరశ్మిని అడ్డుకుని దాన్ని భూమికి చేరకుండా అంతరిక్షంలోకే తిప్పి పంపుతాయి. ఫలితంగా భూమి చల్లబడుతుంది. ఈ అణువులు కనీసం రెండేళ్లపాటు వాతావరణంలో అలాగే ఉండిపోతాయి. 1991లో ఫిలిప్పీన్స్‌లో మౌంట్ పినాటుబో అగ్నిపర్వత పేలుడు వల్ల దాదాపు 1.5 కోట్ల టన్నుల సల్ఫర్ డయాక్సైడ్ వాతావరణంలోకి విడుదలైందని అంచనా. దాని దెబ్బకు ప్రపంచవ్యాప్తంగా వాతావరణం 0.5 డిగ్రీ సెల్సియస్ మేరకు చల్లబడిపోయింది. 1815 తరహావి, అంతకు మించిన భారీ అగ్నిపర్వత పేలుళ్లు సంభవిస్తే భూమి ఏకంగా 1.5 డిగ్రీల దాకా చల్లబడిపోయే ఆస్కారముంది. అదే జరిగితే ఈసారి నష్టతీవ్రత మరింత భారీగా ఉంటుందని న్యూయార్క్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మైకేల్ రాంపినో అన్నారు. ''ప్రస్తుతం రికార్డులు బద్దలు కొట్టే స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలే అందుకు కారణం. వేడి వాతావరణంలో ఏరోసెల్ అణువులు మరింత చిన్న పరిమాణంలో ఏర్పడతాయి. దానికి తోడు వాతావరణపు పై పొరల్లో శరవేగంగానూ, సుదూరాలకూ పయనిస్తాయి.

## తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటన క్రమం, ప్రమాదం జరిగిన వివరాలు, సమయం తదితర విషయాలకు సంబంధించి సమగ్ర సమాచారంతో కూడిన వీడియోను రూపొందించి ప్రజల ముందుంచామని తెలిపారు. కేసును ఎంతో నిబద్ధతతో విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు. అయినా.. కొంతమంది పనిగట్టుకొని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పోలీస్ శాఖను అగౌరవపరిచేలా తప్పుడు ప్రచారం చేస్తే ఉపేక్షించబోమన్నారు. ఈ కేసుకు సంబంధించి ఎవరి వద్దనైనా ఆధారాలు, అదనపు సమాచారం ఉంటే పోలీస్ శాఖకు అందించాలని, అంతే తప్ప సొంత వాఖ్యానాలు చేయవద్దని అన్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోరారు.

## డీజిల్ బస్సుకు ఎలక్ట్రిక్ రూపు

(మొదటిపేజీ తరువాయి)

డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చటానికి రెండేళ్ల క్రితమే రాష్ట్ర ప్రభుత్వ సాయం కోరింది. కానీ, ప్రభుత్వం స్పందించకపోవటంతో తాజాగా కేంద్రం తలుపు తట్టింది. రెట్రో ఫిట్‌మెంట్‌కు ఆర్థిక సాయం చేయాలని లేఖ రాసింది.

**ఆ ప్రయోగం సక్సెస్..**

డీజిల్ వ్యయాన్ని భరించలేక ఎలక్ట్రిక్ బస్సుల వైపు మొగ్గు చూపాలని మూడేళ్ల క్రితం ఆర్టీసీ ప్రయత్నాలు ప్రారంభించింది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ఫేమ్ పథకం కింద 40 ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు సరఫరా చేసింది. వాటిని ఇప్పుడు హైదరాబాద్ నుంచి ఎయిర్‌పోర్టుకు నడుపుతోంది. ఆ సమయంలో ఒక్కో బస్సు ధర రూ.2 కోట్ల వరకు ఉండటంతో సొంతంగా ఎలక్ట్రిక్ బస్సులు కొనటం సాధ్యం కాదని చేతులెత్తేసింది.

రెట్రో ఫిట్‌మెంట్ ద్వారా రూ.60 నుంచి రూ..65 లక్షలతోనే డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చవచ్చని గుర్తించి, అందుకోసం టెండర్లు పిలిచింది. ఎలక్ట్రిక్ రైల్ లోకోమోటివ్‌లు తయారు చేస్తున్న ఓ ప్రైవేటు సంస్థ రెట్రో ఫిట్‌మెంట్‌కు ఆసక్తి చూపింది.

శాంపిల్‌గా ముషీరాబాద్ డిపోకు చెందిన ఒక బస్సును ఆ సంస్థ రెట్రో ఫిట్‌మెంట్ చేసి ఇచ్చింది. ప్రస్తుతం అది ఉప్పల్ డిపో పరిధిలో తిరుగుతోంది. ఈ ప్రాజెక్టు భారాన్ని మొత్తం మోయలేనని భావించిన ఆర్టీసీ.. రేండేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వ సాయం కోరింది. ప్రభుత్వం కూడా సాయం చేయలేనని చేతులెత్తేయటంతో ప్రాజెక్టు అంతటితో ఆగిపోయింది.

**కేంద్రం వైపు ఆర్టీసీ చూపు**

నగరంలో డీజిల్ బస్సులను తొలగించి వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులే తిప్పాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా పీఎం ఈడ్రైవ్ పథకానికి శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా 9 ప్రధాన నగరాలకు 11 వేల ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేయాలని నిర్ణయించింది.

వాటిలో తనకు 2,500 బస్సులు కావాలని ఆర్టీసీ దరఖాస్తు చేసుకుంది. పనిలో పనిగా రెట్రో ఫిట్‌మెంట్ ద్వారా పాత డీజిల్ బస్సులను ఎలక్ట్రిటక్ బస్సులుగా మార్చేందుకు కూడా ఓ విధానం ప్రకటించాలని లేఖ రాసింది. రెట్రో ఫిట్‌మెంట్ పరిజ్ఞానాన్ని ప్రోత్సహిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని లేఖలో పేర్కొంది.

ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా తిరుగుతున్న బస్సును ఉదహరించింది. ఈ లేఖపై కేంద్రం ఇంకా స్పందించలేదు. కేంద్రం గనుక రాయితీ పద్ధతిలో రెట్రో ఫిట్‌మెంట్‌కు పాలసీ అందుబాటులోకి తెస్తే, ఆర్టీసీ వద్ద ఉన్న పాత డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చి నిర్వహించేందుకు చాలా సంస్థలు ముందుకొచ్చే అవకాశం ఉంది.

## హిమాచల్‌లో భారీ మంచు

(మొదటిపేజీ తరువాయి)

ఖద్రాలాలో అత్యధికంగా 24 సెంటీమీటర్లు, సంగ్లాలో 16.5 , షిల్లారోలో 15.3, చోపాల్, జుబ్బల్‌లో 15 సెంటీమీటర్ల చొప్పున, కల్పాలో 14, నిచార్‌లో 10, సిమ్లాలో 7, పూహ్‌లో 6, జోత్‌లో 5 సెంటీమీటర్ల చొప్పున మంచు కురిసింది. ప్రతికూల వాతావరణం, హిల్ స్టేషన్‌కు వెళ్లే మార్గంలో రహదారిపై ప్రాణాంతక పరిస్థితులు ఉన్నా పర్యాటకులు పోటెత్తారు. సిమ్లాలోని హోటల్ గదుల ఆక్యుపెన్సీ 70 శాతం నమోదైంది. గత ఏడాది డిసెంబర్ కంటే ఇది 30 శాతం ఎక్కువ. మంచు దుప్పటితో అందంగా కప్పబడిన సిమ్లా, మనాలీ చిత్రాలతో సోషల్ మీడియా నిండిపోయింది. శుక్రవారం సాయంత్రం నుంచి ఆదివారం మధ్యా హ్నం వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా సిమ్లాలో భారీ వర్షా లు, మంచు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

## డిగ్రీ థర్డ్ ఇయర్‌లో లాంగ్వేజెస్‌కు టాటా.. ఇక నుంచి కేవలం కోర్ సబ్జెక్టులే

- **ఫస్ట్, సెకండియర్‌లోనే లాంగ్వేజెస్**
- **ఉన్నత విద్యామండలి నిర్ణయం**

హైదరాబాద్, డిసెంబర్ 25 : ఉన్నత విద్యామండలి డిగ్రీ మూడో సంవత్సరంలో లాంగ్వేజెస్‌కు టాటా చెప్పనుంది. థర్డ్ ఇయర్‌ను కేవలం కోర్ సబ్జెక్టులకే పరిమితం చేయనుంది. ఇక నుంచి లాంగ్వేజెస్ ఫస్ట్, సెకండియర్‌లోనే చదవాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ విషయంపై ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకోగా, 202526 విద్యాసంవత్సరంలో ఇది అమల్లోకి రానుంది.

**పాత విధానమే..**

వాస్తవానికి ఈ విధానమే గతంలో అమలైంది. కానీ 2021లో డిగ్రీ కోర్సులను సంస్కరించడంలో భాగంగా ఉన్నత విద్యామండలి థర్డ్ ఇయర్‌లో లాంగ్వేజెస్‌ను చేర్చింది. నాలుగేండ్లు దాటకుండానే ఈ నిర్ణయంపై అదే ఉన్నత విద్యామండలి యూ టర్న్ తీసుకుంది. అయితే అప్పుడు నిర్ణయం తీసుకున్న వారిలో ఎవరు ఇప్పుడు ఉన్నత విద్యామండలిలో లేరు.

**థర్డ్ ఇయర్‌లో ప్రాజెక్ట్ వర్క్..**

డిగ్రీ థర్డ్ ఇయర్‌లో ప్రాజెక్ట్ వర్క్‌ను తప్పనిసరి చేశారు. ప్రాక్టికల్స్‌కు బదులుగా ప్రాజెక్ట్‌ను అంతర్భాగం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతానికి ఇంజినీరింగ్ సహా కొన్ని కోర్సుల్లో మాత్రమే ప్రాజెక్ట్ వర్క్‌ను అమలుచేస్తున్నారు. ప్రాజెక్ట్ వర్క్‌కు క్రెడిట్స్ ఉంటాయి. ఆ క్రెడిట్స్‌ను విద్యార్థులు క్లెయిమ్ చేసుకోవచ్చు. మూక్స్‌స్వయం, ఎన్‌పీటీఎల్ వంటి ఆన్‌లైన్ వేదికల ద్వారా అభ్యసించిన కోర్సుల క్రెడిట్స్‌ను సైతం క్లెయిమ్ చేసుకునే అవకాశాన్ని ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు.

## ప్రేమ, ఆనందం, కరుణలతో కూడిన పండుగే క్రిస్మస్

* కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రేమ, ఆనందం, కరుణలతో కూడిన పండుగే క్రిస్మస్ అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. సూరారం డివిజన్ స్కందానగర్ లోని "మరనాత బైబిల్ మిషన్ దేవాలయం" నందు రెవ.తిమోతి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ పండుగ సెలబ్రేషన్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ఆ యేసు ప్రభు దయతో ప్రజలంతా సంతోషంగా ఉండాలన్నారు. అనంతరం షాపూర్ నగర్ ప్రధాన రహదారిలోని రైతు బజార్ సమీపంలో గల బేతెలు ప్రార్థన మందిరం నందు నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, పాస్టర్ సూరపనేని ప్రభు ప్రసాద్, సందీప్ కుమార్, నాయకులు దొడ్ల ఆంజనేయులు, దొడ్డ శ్రీను, రాంబాబు , వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలి

* కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. బుధవారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చింతల్ డివిజన్ రంగా నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులు , సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ సంక్షేమ సంఘాల సమిష్టి కృషితోనే కాలనీల సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని కాలనీలు, బస్తీలలో గత పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో మౌలిక వసతులను కల్పించామన్నారు. రానున్న రోజుల్లో కూడా కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు బండారు వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి జన్ను లక్ష్మణ రావు, వైస్ ప్రెసిడెంట్ మండవ రాంప్రసాద్, ట్రెజరర్ సరోజ, జాయింట్ సెక్రెటరీ ఎం వి సత్యనారాయణ, కమిటీ మెంబర్స్ గుమ్మడి రామకృష్ణ, మహేష్, ఆనంద్, సురేందర్, నరసయ్య, ఎల్లప్ప, కేశవ, కరుణాకర్, పద్మజా రెడ్డి, శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మాపూర్ లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



మెదక్ , ప్రజాస్ఫూర్తి : గ్రామంలో క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మెదక్ జిల్లా రామాయంపేట మండలం లక్ష్మాపూర్ లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంజీరా సేవా సమితి అధ్యక్షులు మేంగర్తి సుధాకర్ పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నీరుపేదలకు చీరలతో పాటు గత పది సంవత్సరాల నుండి ఉమ్మడి జిల్లాలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని ఇక ముందు నీరు పేదలకు తనకు తగినంత సహాయ సేవ కార్యక్రమాలు చేయడానికి వెనుకాడనని ఆయన పేర్కొన్నారు. నిరుపేదలకు సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే తన వంతు సహాయ సహకారాలు అందించడంలో వెనుకాడనని అన్నారు. లక్ష్మాపూర్ గ్రామంలో త్వరలో మంజీర సేవా సమితి ఆధ్వర్యంలో మినీ లైబ్రరీ ఏర్పాటు చేస్తానని లైబ్రరీ ఏర్పడుతో నిరుద్యోగులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

## పుట్టగూడెం అంగన్వాడీ టీచర్ సస్పెండ్

రాజాపేట, (ప్రజాస్ఫూర్తి) : రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామంలోని అంగన్వాడి టీచర్ షహనాజి ని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఐసిడిఎస్ అధికారులు వివరాలు చెప్పారు. బాలామృతం పక్క త్రోవ పట్టిందని నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేసినట్లు చెప్పారు. జిల్లాలోని నాలుగు మండలాల్లో బాలామృతం అంగన్వాడీ కేంద్రాల నుండి పక్కతోవ పట్టిందని ఎస్ఓటి పోలీసులు నిర్ధారించినట్లు తెలిసింది. కల్తీ పాల విక్రయ దందా విషయంలో ఎస్ఓటి పోలీసులు ఆపరేషన్ సందర్భంగా మోత్కూరు కేంద్రంగా అంగన్ వాడీ కేంద్రాల నుండి బాలామృతం పక్కదారి పట్టినట్లు తెలిసింది. దీంతో రాజపేట మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో ఐసిడిఎస్ అధికారులు, ఎస్ఓటి పోలీసులు ప్రత్యేక నిఘా తనిఖీలు చేయనున్నారు.

## స్థలం యజమాని కడితే అక్రమం...

# దళారులు కడితే సక్రమం..

* సర్వేనెంబర్ 100 లో నిర్మాణాలు కొందరికైనా...
* సుప్రీంకోర్టు ఆదేశాల్లో సైతం డోంట్ కేర్...
* కొందరు కడితే వెంటనే కూల్చి వేసున్న రెవెన్యూ అధికారులు...
* దళారులు కడితే సపోర్ట్ చేస్తున్నా రెవిన్యూ సిబ్బంది...
* ఈ కట్టడాల వెనకున్న మాయగాళ్లెవరు...





**ప్రజాస్ఫూర్తి, శేరిలింగంపల్లి :**

శేరిలింగంపల్లి మండల రెవిన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 100 దశాబ్దాల కాలం నుంచి వివాదంలో ఉంది. ప్రభుత్వ స్థలమని కొంతమంది ప్రైవేట్ స్థలమని మరి కొంతమంది కోర్టుమెట్లు ఎక్కారు. దీంతో అప్పటి నుంచి కాలనీలోని నిర్మాణాలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. అయినా నిత్యం నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. అంతే కాకుండా పార్కుల సైతం కనుమరుగుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. 40 సంవత్సరాల క్రితం కొన్న పేదవారు ఇక్కడ ఇల్లు కట్టుకోవాలంటే కోర్టు ఆదేశాలు ఉన్నాయంటూ రెవెన్యూ సిబ్బంది అడ్డుపడుతూనే ఉంటారు. కానీ కాలనీలోని కొంతమంది దళారులకు ముడుపులు అందిస్తే రెవెన్యూ అధికారులు కానీ, సిబ్బంది గానీ ఈ చుట్టుపక్కల కనిపించరని కాలనీవాసులే ఆశ్చర్యపోతున్నారు. చిన్న చిన్న కట్టడాలే కాదు పెద్దపెద్ద షెడ్లు నిర్మాణాలు జరుగుతున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుంటారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 20 నుంచి 30 కట్టడాలు కట్టారని ఇవన్నీ కేవలం ఒక వ్యక్తి మాత్రమే గుత్తేదారుగా నిర్మాణాలు చేపట్టారని అందరికీ లేని పర్మిషన్లు ఇతనికి ఎలా ఇచ్చారో చెప్పాలని నిలదీస్తున్నారు. ఒక్కొక్క నిర్మాణం నుంచి పది నుంచి 15 లక్షలు తీసుకొని నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. నిర్మాణాలు కట్టుకుంటే కాలనీ అభివృద్ధి చెందుతుందని కానీ ఇలా దళారుల చేతిలో పెడితే ఎంతోమంది నిర్మాణానికి అయ్యే ఖర్చు కేవలం దళారులకు మాత్రమే ఇవ్వవలసి వస్తుందని అందుకు ఎవరూ ముందుకు రావడం లేదని వారు తెలిపారు. దీనితోపాటు కాలనీలోని అనేక పార్కులు ఎవరికీ తెలియకుండా నోటరీ చేశారని ప్రస్తుతం ఉన్న ప్రశాంత్ నగర్ సొసైటీ అధ్యక్షుడు మారితే తప్ప ఇవన్నీ బయటపడవని అన్నారు. రెవెన్యూ అధికారులు వీటి పై దృష్టి సాధించకపోతే రాబోయే కాలంలో పార్కుల సైతం ఉండమని కాలనీవాసులు వాపోతున్నారు.

## క్రీస్తు ఆశించిన శాంతియుత లోక నిర్మాణంకోసం కృషి చేద్దాం

* కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అహింసా, నీతి, సత్యం, ధర్మ గుణాలతో జీవించాలనే యేసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమని, అయన ఆశించిన లోక నిర్మాణంకోసం అందరూ పాటుపడాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. యేసుక్రీస్తు జన్మదినం క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని బుధవారం కొత్తగూడెం పట్టణం, పరిసర గ్రామాల్లోని సీఎస్ఐ, ఆర్సిఎమ్, బెతానీయ, పెంతికోస్తు తదితర చర్చిల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో అయన పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్కును కట్ చేసి క్రైస్తవ కుటుంబాలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ సర్వమతాలు మంచినే బోధిస్తాయని, అన్ని మతాల గమ్యం సమాజంలో శాంతిని నెలకొల్పడం, మానవ సంబంధాలను మెరుగుపర్చడం కోసమేనని అన్నారు. ఉత్సవాలకు ఆహ్వానించిన చర్చికమిటీ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, నాయకులు కంచర్ల జమలయ్య, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు యాకూబ్, నేరెళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్పొరేటర్ కొలుకుల జగన్ జన్మదిన వేడుకలు





జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ జన్మదినం సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ లోని ఆయన నివాసం వద్ద బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై కార్పొరేటర్ చేత కేక్ కట్ చేయించి శాలువా కప్పి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా వార్డ్ మెంబర్ బింగి ఇందిరాగౌడ్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పలువురు నాయకులు, అభిమానులు వారికి పూలమాలలతో, శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, నాయకులు బండి సత్యనారా యణ, లక్ష్మీ, శశికళ, కొలుకుల జైహింద్, సాయి, పి.సతీష్ రెడ్డి, మహిళా నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

## బిలోవర్ చర్చ్ లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : క్రిస్మస్ పర్వదినం సందర్భంగా బుధవారం భువనగిరి పట్టణంలో బిలోవర్ చర్చ్ లో హేరే కార్ శ్రీను ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్టమస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సేవకులను శాలువతో సత్కరించి, చీరలు పంపిణీ చేసి, కేక్ కట్ చేసి, క్రిస్టియన్ సోదరీ సోదరీమణులకు క్రిస్ మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పిసిసి డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్, నక్కల ఆదినారాయణ, పచ్చర్ల జగన్, ముత్తు, పల్లెల యాదగిరి, కరీం, బోయిని బాలయ్య, మాజీ ఎంపిటిసి ములుగు లక్ష్మయ్య, శెట్టి బాలయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

* కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుల మతాలకు అతీతంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా బుధవారం షాపూర్నగర్లోని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ నివాసం వద్ద నియోజకవర్గంలోని ప్రజలు, యువజన నాయకులు, సంక్షేమ సంఘాల నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు మర్యాదపూర్వకంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ని కలిసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా ఉండాలన్నారు.

# ఘనంగా మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్ పాయ్ జయంతి వేడుకలు



యాదాద్రి భువనగిరి, (ప్రజాస్ఫూర్తి) : భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్ పాయ్ జయంతి సందర్భంగా బుధవారం బీజేపీ పార్టీ పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరామ్ ఆధ్వర్యంలో వినాయక చౌరస్తా వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు భాస్కర్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలో క్రమశిక్షణకు మారు పేరు అయినటువంటి స్వర్గీయ భారతరత్న అటల్ బిహారి వాజ్ పాయ్ అగ్రదేశాలు ఎన్ని అంక్షలు విధించినప్పటికీ అణు పరీక్షలను విజయవంతంగా నిర్వహించారన్నారు. గ్రామీణ సడక్ యోజన ద్వారా పట్టణాలు పల్లెలను కలుపుతూ వాణిజ్య పరంగా ముందుకు తీసుకెళ్లారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మునిసిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, జనంపల్లి శ్యామ్ సుందర్ రెడ్డి,కిసాన్ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, జనగాం కవిత నర్సింహా చారి,సుర్వి శ్రీనివాస్ ,చందుపట్ల వెంకటేశ్వరరావు, డిఎల్ఎన్ గౌడ్, వైజయంతి, ఉడుత భాస్కర్ ,చిరక సురేష్ రెడ్డి,నీలం రమేష్ ,కొల్లోజు శ్రవణ్ ,కోళ్లబిక్షపతి,మహమూద్ ,పట్టణ ప్రధాన కార్యదర్శి రాళ్లబండి కృష్ణచారి, ఎంగిలి లక్ష్మణ్, ఎదుగాని సంతోష్,వల్లంశెట్టి నగేష్,మంగు నర్సింహా రావు,దాసరి స్వామి, తాడూరిబాలశంకర్ ,మల్లికార్జున్,గిరిధర్ ,అనిల్ ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంత పెద్ద "గుంత" ఎవరికి కనిపించడం లేదా..?

* గుంతల రోడ్డులో ప్రయాణం.. నిత్యం నరకం
* అభివృద్ధి అంటే ఇదేనా..?





ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:ఇటీవల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రోడ్డు భద్రత పై సమావేశంలో జిల్లా అధికారులు రోడ్డు భద్రత.. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా అధికారులు వివరించిన విషయం తెలిసిందే. రోడ్డు భద్రత అంటే ఇదేనా..?.. గుంతలు పడిన రోడ్లు.. ప్రమాద భరితంగా మారాయి.. గుంతలను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టి వాహనాదారుల ప్రాణాలను కాపాడాల్సిన అధికారులు చూసి చూడకుండా వ్యవహరించడంతో ఆ గుంతలో పడి వాహనాదారుల గాయాలపాలై ప్రాణాలను కోల్పోతున్నారు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణం లోని కరెంట్ ఆఫీస్ చౌరస్తాలో గత కొంతకాలంగా నడిరోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి వాహనాదారులు ఆ గుంతలో పడి గాయాల ఫాలో అవుతున్న సంఘటనలు ఎన్నో ఉన్నప్పటికీ అధికారులు మాత్రం ఆ గుంతలు మరమ్మతులు చేయించడంలో విఫలమవుతున్నారని వాహనాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇల్లందు కరెంట్ ఆఫీస్ చౌరస్తా నుండి ఇల్లందు నుండి ఖమ్మం కొత్తగూడెం నుండి ఇల్లందు వచ్చే ప్రధాన రహదారి లో భారీ గుంతలు ఏర్పడి అందులో పడి గాయాల పాలుతున్నారు.. ఇప్పటికైనా ఆర్ అండ్ బి శాఖ సంధించి ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతల్లో మరమ్మతులు చేయించాల్సిందిగా వాహనదారులు కోరుతున్నారు..

# ఫుడ్ ఫ్యాక్టరీ బిర్యానీ సెంటర్ ప్రారంభం

భువనగిరి, ప్రజా స్ఫూర్తి టౌన్ : వ్యాపార రంగంలో రాణించాలంటే లాభాపేక్ష లేకుండా సేవా దృక్పథంతో నాణ్యమైన సేవలు అందించి గుర్తింపును పొందాలని శాసనసభ్యులు అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కార్పొరేట్ స్థాయిలో ఫుడ్ ఫ్యాక్టరీ బిర్యానీ ఎయిర్ కండిషనర్ నూతన బ్రాంచ్ సెంటర్ ను బుధవారం శాసనసభ్యులు అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఎంతో ఆహ్లాదకరమైన సుచి శుభ్రత కూడిన బిర్యాని సెంటర్ అందుబాటులోకి తెచ్చినా హోటల్ యజమాన్యానికి అభినందించారు. యువత ప్రభుత్వ ఉద్యోగాలకు ఎదురు చూడకుండా స్వయం ఉపాధి అందిస్తున్న హోటల్ పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగ యువతకు పనిని కల్పించి



ఉపాధి పెంపొందించుకోవాలని కోరారు. కస్టమర్లను దేవుళ్ళగా భావించి ప్రజల్లో మంచి మన్ననలు అందుకోవాలని కోరారు. సుచి శుభ్రతతో కూడిన ఆహార పదార్థాలు వినియోగదారులకు అందించి పర్యావరణ ఆరోగ్య పరిరక్షణ కాపాడాలని కోరారు.

ఫుడ్ ఫ్యాక్టరీ బిర్యాని సెంటర్ యజమాని నవీన్ కుమార్ మాట్లాడుతూ సుదీర్ఘమైన హోటల్ పరిశ్రమంలో అనుభవం కలిగిన మాస్టర్లచే నిర్వహించబడుతున్న హోటల్లో అనుభవంలో గత పది సంవత్సరాల నుండి భువనగిరి పట్టణంలోని జిల్లా ప్రాంతంలోని ప్రజలకు నాణ్యమైన రుచికరమైన మటన్ చికెన్ బిర్యానీ తో పాటు చైనీస్ పరాటా ఉత్తర దక్షిణ రాష్ట్రాల ప్రజలకు అనుగుణంగా రుచి కరమైన వంటలు తయారు చేయడం మా హోటల్ యొక్క ప్రాధాన్యత ప్రజలకు తెలిసిందేనని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎవేజ్ చిస్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, మున్సిపల్ చైర్మన్ పోతం శెట్టి వెంకటేశ్వర, సేవాదళ్ పిట్టల బలరాజ్, కౌన్సిలర్లు ఇరుబాక నరసింహ కైరం కొండ వెంకటేష్ వాడి చర్ల కృష్ణ యాదవ్ ,దిడ్డిగాడి భగత్, అమర్ నాథ్, గ్యాస్ చిన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాడు వాజ్పేయి ప్రవేశపెట్టిన సంస్కరణలే నేడు దేశాభివృద్ధికి మార్గ దర్శకం

- **బిజెపి ముస్తాబాద్ మండల అధ్యక్షుడు మెరుగు అంజా గౌడ్**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:నాడు వాజ్పేయి ప్రధానిగా ప్రవేశ పెట్టిన సంస్కరణలే నేడు ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశ అభివృద్ధికి దోహదపడుతున్నాయని బిజెపి ముస్తాబాద్ మండల అధ్యక్షుడు మెరుగు అంజా గౌడ్ అన్నారు. బిజెపి ముస్తాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్పేయి శత జయంతి వేడుకలను ముస్తాబాద్ మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్పేయ్ చిత్ర పటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంస్కరణలతో దేశ ప్రధానిగా అటల్ బిహారీ వాజ్పేయ్ దేశాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టించారని అన్నారు. వాజ్పేయ్ ని స్ఫూర్తిగా తీసుకొని



ప్రస్తుత దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. నాడు ఒక్క ఓటుతో ప్రభుత్వాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్లమెంట్ లో అవహేళన చేసిన సందర్భంలో దేశంలో కమలం వికసిస్తుందని వాజ్పేయి చేసిన ఉపన్యాసం ఇప్పటికీ కార్యకర్తలకు స్ఫూర్తి అని అన్నారు. మనస్ఫూర్తితో నేడు నరేంద్ర మోడీ నేతృత్వంలో బిజెపి అజయ్ శక్తిగా ఎదిగిందని, వాజ్పేయి జీవన విధానం ప్రతీ కార్యకర్తకు మార్గదర్శకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ మల్లారపు సంతోష్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బాద నరేష్, సీనియర్ నాయకులు చిట్టినేని శ్రీనివాసరావు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు ఏదునూరి గోపి, తిరుపతి, కోలా కృష్ణ, చీకోటి మహేష్, జిల్లెల్ల మల్లేశం, ఓరుగంటి సత్యం, దీటి సత్తయ్య, మీసా శంకర్, మీసా స్వామి, శ్రీనివాస్ తదితరున్నారు.

# మాజీ ప్రధాని వాజ్పేయి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం

* **మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బిజెపి అధ్యక్షులు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి**

జగద్గిరిగుట్ట, , (ప్రజాస్ఫూర్తి) మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారి వాజ్ పేయి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బిజెపి అధ్యక్షులు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి అన్నారు. మాజీ ప్రధాని భారత రత్న స్వర్గీయ అటల్ బిహారి వాజపేయ్ శత జయంతి సందర్భంగా బుధవారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి గురుమూర్తి నగర్ జిల్లా పరిషత్ స్కూల్ ఆవరణలో బీజేపీ నాయకులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాజ్ పేయిని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్ళాలని పిలుపు నిచ్చారు. వాజ్పేయ్ ప్రవేశపెట్టిన సంస్కరణలే నేడు దేశాభివృద్ధికి మార్గదర్శకమన్నారు. అనంతరం జీహెచ్ఎంసీ కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, డివిజన్ అధ్యక్షులు పరిష వేణు, బిజెపి నాయకులు జే.సందీప్ కుమార్, మణికంఠ, శ్రీ సెన్ , ఆశ తుల్జాపురి, గరిగె శేఖర్, యువసేనా, బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**జగద్గిరిగుట్ట డివిజన్ లో ....**





మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ అటల్ బిహారి వాజపేయ్ శత జయంతి సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ చివరి బస్ స్టాపులో బీజేపీ డివిజన్ అధ్యక్షులు పున్న రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జే.కె. శేఖర్ యాదవ్ పాల్గొని వాజ్పేయ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాజ్పేయ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్ రెడ్డి , సిద్ధిరామిరెడ్డి , పరశురాం, రాజేందర్ రెడ్డి, రాజు యాదవ్ , వసుంధర , శ్రీహరి , నాగరాజు యాదవ్ , బి శ్రీనివాస్, లత , గౌతమి తదితరులు పాల్గొన్నారు



# SI, మహిళా కానిస్టేబుల్‌తో పాటు మరొకరు చెరువులో దూకి ఆత్మహత్య..?

కామారెడ్డి జిల్లాలో సంచలన ఘటన చోటుచేసుకుంది. ఓ ఎస్సై సహా మహిళా కానిస్టేబుల్ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్టుగా తెలుస్తోంది. ఇద్దరితో పాటు మరొక వ్యక్తి కూడా ఆత్మహత్యకు పాల్పడినట్టుగా సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కామారెడ్డి జిల్లాలోని భిక్కనూర్ ఎస్సై సాయికుమార్ గత రెండు రోజులుగా కనిపించడం లేదు. బుధవారం సాయంత్రం బిబిపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శృతి ఫోన్ కూడా పనిచేయడం లేదు. ఎస్సై సహా కానిస్టేబుల్ ఇద్దరి ఫోన్లు స్విచ్చాఫ్ రావడంతో పోలీసులు ట్రేసింగ్ చేయగా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్ద ఉన్నట్టుగా తెలిసింది. బుధవారం రాత్రి పోలీసులు హుటాహుటిన చెరువు వద్దకు వెళ్లారు. చెరువు వద్ద ఎస్సై కారు, చెప్పులు, కానిస్టేబుల్ ఫోన్లు లభ్యమయ్యాయి. అయితే ఈ ఇద్దరితో పాటు బిబిపేట సొసైటీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న నిఖిల్ కూడా ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలుస్తోంది. ప్రస్తుతం ఎస్సై, మహిళా కానిస్టేబుల్, సొసైటీ ఆపరేటర్ ముగురు ఆత్మహత్యకు పాల్పడటం సంచలంగా మారింది. చెరువు వద్దకు జిల్లా ఎస్పీ సింధూశర్మ చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం సదాశివనగర్, బిక్కనూర్, కామారెడ్డి పట్టణ సిఐలు, ఎస్సైలు, పోలీసుల బృందం చెరువు వద్ద ఉండి బోటు సహాయంతో గాలింపు చర్యలు చేపడుతున్నారు. చెరువు పరిధి పెద్దగా, లోతుగా ఉండటంతో పాటు చీకటి కావడంతో గాలింపునకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మహిళా కానిస్టేబుల్ శృతి స్వగ్రామం గాంధారి మండల కేంద్రం. 10 సంవత్సరాలుగా పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శృతికి తల్లిదండ్రులు, చెల్లె, తమ్ముడు ఉన్నారు. పేద కుటుంబానికి చెందిన శృతి చాలా ధైర్యవంతురాలని, ఆత్మహత్య చేసుకునే పిరికితనం లేదని ఆమె సోదరుడు నటరాజ్ దిశతో మాట్లాడుతూ తెలిపారు. గతంలో శృతికి పెళ్లయినప్పటికీ వ్యక్తిగత కారణాలవల్ల ఐదు సంవత్సరాల క్రితం భర్తతో విడాకులు తీసుకుందని, ప్రస్తుతం తాను ఒంటరిగా ఉంటుందని తెలిసింది. చెరువు వద్ద ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసి ఫ్లడ్ లైట్ల వెలుతురులో రెస్క్యూ టీం గాలింపులు కొనసాగుతున్నాయి. ఎస్ఐ సాయికుమార్, మహిళా కానిస్టేబుల్ శృతిల మధ్య ఏం జరిగి ఉంటుందని, వీరిద్దరి మధ్య అధికారి, సబార్డినేట్ బంధం కాకుండా వ్యక్తిగత సంబంధం ఏమైనా ఉన్నాయా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. వీరి మధ్య ఉన్న వ్యక్తిగత సంబంధాల కారణంగానే భేదాభిప్రాయాలతో, ఇద్దరి మధ్య గొడవలు జరిగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారేమోనని అనుమానాలు, అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# సీఎంతో సినీ ప్రముఖుల భేటీ.. విజయశాంతి ఇంట్రెస్టింగ్ ట్వీట్



టాలీవుడ్ సినిమా ఇండస్ట్రీ, ప్రభుత్వం మధ్య ప్రస్తుతం నెలకొన్న వివాదాల నేపథ్యంలో.. సీఎంతో సినీ ప్రముఖులు రేపు ఉదయం 10 గంటలకు సమావేశం కానున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ సమావేశం జరగనుండగా ఇండస్ట్రీ నుంచి చిరంజీవి, వెంకటేష్, అల్లు అరవింద్, దిల్ రాజులు పాల్గోన నుండగా.. ప్రభుత్వం నుంచి డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్, దామోదర రాజనర్సింహ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంతో.. టాలీవుడ్ సీనియర్ నటి, మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత విజయశాంతి ఇంట్రెస్టింగ్ ట్వీట్ చేశారు. ఆమె తన ట్వీట్‌లో "తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులను గురువారం నాడు కలుస్తున్న సినిమా పరిశ్రమకు, ప్రభుత్వానికి సమగ్రమైన విశ్లేషణాత్మక చర్చలు జరగాలన్నారు. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి, సినిమాటోగ్రఫీ మంత్రి విస్పష్టంగా ఇకపై ఉండబోవన్న టికెట్ రేట్ల పెంపు, సంక్రాంతి స్పెషల్ షోల అనుమతిపై మాత్రమే కాక, తెలంగాణ సినిమా, సంస్కృతి, ఆచార విధానాల ఉద్దీపన, చిన్న స్థాయి కళాకారులు, సాంకేతిక నిపుణులు, వారి ఉద్యోగ, నివాస భద్రతలు, జీవన ఆధారాలు, ప్రభుత్వ హామీలు, చిన్న మధ్య స్థాయి బడ్జెట్ చిత్రాల విడుదలకు థియేటర్ల కేటాయింపు, ఇలా అన్నిటిపైనా సమగ్రమైన చర్చ, ప్రకటన కూడా వస్తుందని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఈ సర్వత్రా చర్చల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ విధానం తప్పక నిర్ణయాత్మకంగా ఉంటదని విశ్వసిద్దాం." అని రాసుకొచ్చారు.

## డివైడర్‌ను ఢీకొట్టిన బైక్.. వ్యక్తి మృతి

**చేవెళ్ల** : బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందారు. ఈ ఘటన చేవెళ్ల పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. షాద్ నగర్ కు చెందిన దప్పు అనంతయ్య(50) బుధవారం బైక్‌పై చేవెళ్లకు వచ్చి తిరిగి షాద్ నగర్ కు వెళ్తుండగా షాబాద్ రోడ్డులో డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయలై రక్తస్రావాలు కాగా, చికిత్స నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అనంతయ్య మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



## ఎమ్మెల్యే సారూ.. మా ఊరి రోడ్డు బాగు చేయండి...

**నాగల్గిద్ద:** నాగల్గిద్దా మండల ఎనక్ పల్లి నుండి మావినెల్లి తండా మార్గన గల రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్లు పూర్తిగా దెబ్బతిన డంతో ప్రయాణీకులు , గ్రామస్తులు రాత్రి వేళల్లో ఈ రోడ్ల గుండా ప్రయాణించాలంటేనే భయపడు తున్నారు. ఎమ్మెల్యే సారూ.. ఒక్కసారి మా ఊరి రోడ్డు పరిస్థితి చూడండని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు అధికారంలో ఉంది. కానీ కనీసం మా ఊరి రోడ్డు గురించి పట్టించుకోలేదు. ఎక్కడా దాని గురించి మాట్లాడలేదు. రోడ్డు మొత్తం ధ్వంసంమై రోడ్డు మొత్తం కంకర తేలింది. మా ఊరి నుండి మావినెల్లి తండా మెయిన రోడ్డుకు వెళ్లడానికి 5 కిలోమీటర్లు మాత్రమే ఉంది. కానీ రోడ్డు సరిగా లేక గ్రామస్తులు చాలా అవస్థలు



పడుతున్నారు. ప్రభుత్వలు మారిన ఎమ్మెల్యేలు మారిన మా ఊరి రోడ్డు పరిస్థితి మాత్రం మారడం లేదు. ప్రజలపాలన ప్రభుత్వంలోనైనా మా ఊరి రోడ్డు బాగుచేయించండి ఎమ్మెల్యే సారూ అని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రమాదం ఎప్పుడు ఎ రూపంలో వస్తుందోనాన్ని గ్రామస్తులు బయప డుతున్నారు. మా ఊరికి రోడ్లు బాగా చేయించాల ని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## చర్చిల్లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సుడిగాలి పర్యటన.

**వికారాబాద్** : వికారాబాద్ పట్ట ణంలోని మెథడిక్ చర్చి, జనరేషన్ ఫర్ క్రైస్ట్ చర్చి, ఇమ్మానియల్ ఎజీ చర్చిలలో బుధవారం జరిగిన క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్. పాల్గొ న్న మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి మంజుల రమేష్, కౌన్సిలర్లు, నాయకులు, ఫాస్టర్లు, క్రిస్టియన్ సమాజ సభ్యులు. ఈసందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ తన సందేశాన్ని అందిస్తూ.. క్రిస్టియన్ సోదర, సోద రీమణులకు నా హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాం క్షలు తెలియజేశారు. "ఏసుక్రీస్తు జన్మించిన పవిత్ర దినం క్రిస్మస్. క్రీస్తు పుట్టింది డిసెంబర్ నెలలోనే, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ మొదలైంది డిసెంబర్ నెలలోనే, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ పుట్టినరోజు కూడా డిసెంబర్ నెలలోనే కావడం విశేషం. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ మంది జరుపుకునే పండుగ క్రిస్మస్. భారతదేశం భిన్న మతాల, కులాల సమూహం. మన ఆచారాలను గౌ రవిస్తూ, ఇతరుల ఆచారాలను కూడా గౌరవించడం మానవత్వం. అందరం కలిసి మెలిసి జీవించాలి, ఒకరి కష్ట సుఖాలలో మరొకరు పాలుపంచుకో వాలి. ప్రేమను పంచమని ఏసుక్రీస్తు మానవాళికి భోదించారు. బైబిల్ ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందిస్తున్నది. దేవుడు కరుణామయుడు, దయార్ద్ర హృదయుడు. పాపాలు చేసిన వారిని క్షమించి వారు మంచి మార్గంలో పయనించడానికి మార్గం చూపుతారు. ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవ మిషనరీలు వందల సంవత్సరాలుగా విద్యను, వైద్యాన్ని సేవా భావంతో అందిస్తున్నాయి. నేను కూడా మిషనరీ స్కూల్లో చదువుకున్నాను. క్రిస్టియన్ కాన్వెంట్ స్కూ ళ్లలో టీచర్లు, విద్యార్థులను తమ స్వంత పిల్లలుగా ప్రేమిస్తారు. అక్కడ చదివిన విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉన్నత స్థానాలకు చేరుకుంటారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్ పండుగను అధికారికంగా జరుపుతున్నది. తెలంగాణ ప్రభుత్వం క్రిస్టియన్ సోదరులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ప్ర భుత్వ పథకాలలో క్రిస్టియన్ లను భాగస్వామ్యం చేయాలని నిర్ణయం తీసుకున్నాను. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందే విదంగా చర్యలు తీసుకుంటాను. రాజకీయంగా దేశంలో క్లిష్టమైన పరిస్థితులు ఉన్నాయి. మనకు మేలు చేసే వారు ఎవ రనేది ఆలోచన చేసి వారికి అండగా ఉండాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గంజాయి విక్రయిస్తున్న యువకుల ముఠా అరెస్ట్

**చేర్యాల టౌన్:** గంజాయి అమ్ము తన్న యువకులను అరెస్ట్ చేసి చేర్యాల సీఐ శ్రీను రిమాండ్‌కు పంపారు. చేర్యాల సర్కిల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీను మాట్లాడుతూ.. చేర్యాల పట్టణ శివారులో గంజాయి తాగుతూ, అమ్ముతున్నారన్న నమ్మదగిన సమాచారం తో చేర్యాల ఎస్ఐ నీరేశ్ సిబ్బందితో వెళ్లి నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారని చేర్యాల కు చెందిన రాసూరి నవీన్, చుంచనకోటకు చెందిన ఏశబోయిన కరుణాకర్, చెట్కూరి శ్రావణ్, పొన్నబో యిన పవన్‌లను అదుపులోకి తీసుకొని వారి నుండి 50 గ్రాముల గంజాయి,ఒక ట్రాలీ ఆటో, స్కూటర్, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ ఎల్ శ్రీను మాట్లాడుతూ.. గంజాయి తాగుతూ యువత మత్తుకు బానిసవుతు



న్నారని, చేర్యాల ప్రాంతాన్ని గంజాయి విముక్తిగా చే యడానికి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. ఎవరైనా గంజాయి తాగుతూ కనిపిస్తే సమాచారం అందించిన ఎడల వారిపై చట్టరిత్య చర్యలు తీసు కుంటామని తెలిపారు. ఈ సమావేశంలో చేర్యాల ఎస్ఐ నీరేశ్ ,కానిస్టేబుళ్లు హనుమంతు,గౌతమ్‌లు ఉన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం

**గజ్వేల్ :**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం క్రిస్మస్ వేడుకలు, ఏడుపాయల వనదుర్గమ్మ దర్శనంను పురస్కరించుకొని మెదక్ కు విచ్చే శారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హెలిపాడ్ వద్ద కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికా రప్రతినిధి, గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారు శ్రీకాంత్ రావు ఘన స్వాగతం పలికారు. సీఎం రేవంత్ రెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. గజ్వేల్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేయాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి బండారు శ్రీకాంత్ రావు కు సూచించారు. ని యోజకవర్గంలో అభివృద్ధి పనులపై పార్టీ బలోపే తంపై సీఎంతో కొద్దిసేపు మాట్లాడినట్లు బండారు శ్రీకాంత్ రావు స్పష్టం చేశారు.

## జోగిపేటలో బజరంగదళ్ భారీ ర్యాలీ

- డీఎస్‌పీ నేతృత్వంలో భారీగా పోలీసుల మోహరింపు
- ర్యాలీలో పాల్గొన్న బజరంగ్‌దళ్ జాతీయ అధ్యక్షుడు నీరజ్ దోనేరియా

**జోగిపేట:** దేశవ్యాప్తంగా బజరంగదళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శౌర్య యాత్ర బుధవారం జోగిపేట పట్టణంలో నిర్వహించగా జిల్లా పోలీసు యంత్రాంగం భారీగా పోలీసులను మోహరించిం ది. శౌర్యయాత్రలో భాగంగా నిర్వహించిన ర్యాలీకి ముఖ్య అతిథిగా బజరంగ్‌దళ్ అఖిలభారతీయ అధ్య క్షుడు సంయోజక్ నీరజ్ దోనేరియా హజరుకావడం తో ప్రత్యేకత సంతరించుకుంది. జిల్లా నలుమూల నుంచి వేల సంఖ్యలో భజరంగ్‌దళ్ కార్యకర్తలు తరలి వస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సం గారెడ్డి డీఎస్‌పీ సత్తెయ్య గౌడ్ నేతృత్వంలో స్పెషల్ పో లీసులతో పాటు డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేష న్‌ల నుంచి ఎస్ఐ, పోలీసు సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ ర్యాలీలో జిల్లాలోని సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్, జోగిపేట, పటాన్‌చె



రువు పాంతాల నుంచి వేల సంఖ్యలో భజరంగ్‌దళ్ కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు. శౌర్యాయాత్ర కు ముఖ్య అతిథిగా విచ్చేసిన బజరంగ్ దళ్ అఖిల భారతీయ అధ్యక్షుడు సంయోజక్ నీరజ్ దోనేరియా ప్రారంభించారు. స్థానిక వాసవీకళ్యాణ మండపం నుంచి ప్రారంభమైన ర్యాలీ క్లాక్‌టవర్, గౌని చౌరస్తా, బసవేశ్వర విగ్రహం, మార్కెట్ గంజ్, బస్టాండ్ తహ సీల్దారు కార్యాలయం మీదుగా వెళుతూ అంబేద్కర్ విగ్రహానికి సంయోజక్ నీరజ్ దోనేరియా పూలమాల వేసి ముందుకు కదిలారు. ఈ ర్యాలీ తిరిగి వాసవీక ళ్యాణ మండపానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బజరంగ్‌దళ్ నాయకుడు సుభాష్ చందర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్
- జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి



**తెలంగాణ బ్యూరో** : కామారెడ్డి డిక్లరేషన్ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు ని ర్వహించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సమేతంగా దర్శించుకు న్నారు. అనంతరం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రైతు బంధు అమలుపై స్పష్టమైన హామీని నిలబెట్టుకోవా లన్నారు. యాదాద్రికి రాగానే రైతు బంధు హామీ గుర్తుకువస్తుంది. గ్రామాల వారిగా కలెక్టర్ నుంచి పూర్తి స్థాయి నివేదిక తీసుకురావాలి. జనాభా ప్రాతి పదికన బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి. అప్పుడే ఎన్నికలకు వెళ్ళాలి. న్యాయ పరమైన చిక్కులకు ప్ర భుత్వమే బాధ్యత వ్యవహరించాలి. రూపాయి ఖర్చు లేని హామీ రిజర్వేషన్ అమలు చేయాలి అని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

## లోక కళ్యాణమే అందరి అభిమతం కావాలి

**సీఐ భూపాల్ శ్రీధర్**

**చేవెళ్ల** : కులమతాలు ఏవైనా లోక కళ్యాణమే ప్రతి ఒక్కరి అభిమతం కావాలని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ అన్నారు. మండలంలోని ఆలూర్ గ్రామంలోని చర్చిలో బుధవారం ఎల్ జే సీజీపీఎం క్రీస్తు సంఘం వారి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్రైస్తవ పెద్దలతో కలిసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి, క్రిస్మస్ శుభాకాం క్షలు తెలిపారు. అనంతరం ఆర్ఎంపీ వైద్యుడు వినయ్ కుమార్, పాస్టర్లు తిమోతి, అనోక్ లతో కలిసి ఆయన చేతుల మీదుగా పలువురు ప్రజలకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భం



గా సీఐ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు లోక కళ్యాణం కోసం పాటుపడ్డారన్నారు. ఆయన బోధనలు మా నవాళికి మార్గదర్శకమని, అందరు ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ భక్తులు కొండా మల్లేశం, నర్సింగ్ రావు, క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అలవి కానీ హామీలు అమలు చేయలేకే కాంగ్రెస్ డ్రామాలు

- కాంగ్రెస్ సర్కారుపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మండిపాటు
- కడిగితే పోని పాపాలు చేసింది కాంగ్రెస్ సర్కార్




**తెలంగాణ బ్యూరో** : తెలంగాణ ప్రభు త్వంపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అలవి కానీ హామీలు అమలు చేయలేక డ్రామాలు నడి పిస్తున్నారని మండిపడ్డారు. ఏదో ఎజెండా సృష్టించి ఫేక్ ప్రచారాలు చేస్తు ప్రజల తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ చరిత్ర తెలుసుకో వాలన్నారు. కాంగ్రెస్ చేసిన పాపాలు కడిగితే పోవని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత రహితంగా మాట్లాడుతున్నారు. కొత్త వేషం వేసుకొని కమ్యూని స్టు అవతారం ఎత్తారన్నారు. పాకిస్తాన్, చైనా భూ ఆక్రమణ ఇప్పుడు జరగలేదన్నారు. ప్రధాని కోసం మత ప్రాతిపదికన దేశాన్ని విడగొట్టింది నెహ్రూ కుటుంబం, కాంగ్రెస్ పార్టీ అన్నారు. మణిపూర్ లో జరుగుతున్న సంఘటనలు దురదృష్టకరం అన్నారు.

## లోయలో పడ్డ బస్సు.. ముగ్గురు మృతి

- 24 మందికి పైగా గాయాలు
- ఉత్తరాఖండ్ రాష్ట్రం నైనిటాల్ జిల్లాలో లోయలో ఇపడ్డ బస్సు
- 15 అంబులెన్స్ లతో క్షతగాత్రుల తరలింపు

**నేషనల్ బ్యూరో** : ఉత్తరాఖండ్ లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నైనిటల్ జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న బస్సు లోయలో పడింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. బస్సు 27 మంది ప్ర యాణికులతో అల్మోరా నుంచి హల్ద్వానీకి వెళ్తోంది. భీమ్‌తల్ నగర సమీపంలోని రాగానే బస్సు ఓ వంపు వద్ద అదుపుతప్పి 1,500 అడుగుల లోతైన లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. సుమారు



24 మంది గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. దాదాపు 15 అంబులెన్స్‌లు ఘటనాస్థలికి చేరుకొన్నాయి. క్షతగాత్రులను రోప్‌ల సాయంతో రక్షించి ఆసుపత్రికి తరలించారు.

## విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే

**చేవెళ్ల** : రోల్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఇటీవల శంషాబాద్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ రోల్ బాల్ స్కేటింగ్ పోటీలలో చేవెళ్ల మండల కేం ద్రంలోని వివేకానంద విద్యాసంస్థలో ఆరవ తరగతి చదువుతున్న హుదా ఫాతిమా ఉత్తమ ప్రతిభ కనబరి చింది. ఈ పోటీల్లో విజయం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. జనవరిలో అస్సాంలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ నుంచి హుదా ఫాతిమా పాల్గొననుంది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన హుదా ఫాతిమా తన కోచ్ భాస్కర్, స్థానిక నాయకులు, తల్లిదండ్రులతో కలిసి ఎమ్మెల్యే కాలే యాదయ్యను కలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థిని హుదా ఫాతిమాను, కొచ్ భాస్కర్ ను అభినందించి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులు జాతీయ, అంతర్జా తీయ స్థాయిలో రాణించాలని, క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. అంతకుముందు పాఠశా లలో వివేకానంద విద్యాసంస్థ చైర్మన్ కొరదాల నరేష్ ఫాతిమాను ప్రత్యేకంగా అభినందించి ప్రశంస పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడలలో విద్యా ర్థులను ప్రోత్సాహించడమే తమ విద్యాసంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. తమ విద్యాసంస్థ నుంచి దేశం గర్వించదగ్గ క్రీడాకారులను తయారు చేస్తామని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ వైస్ ఎంపీపీ కర్నే శివప్రసాద్, ఊరెళ్ళ మాజీ సర్పంచ్ జహంగీర్, పాఠశాల మేనేజర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## అఫ్గాన్ లోని తాలిబాన్లపై పాక్ ఎయిర్ స్ట్రైక్

- 46 మంది తాలిబాన్లు మృతి
- నాలుగు ప్రాంతాల్లో వైమానిక దాడులు చేసిన పాక్
- దాడులు నిజమేనని తాలిబాన్ల వెల్లడి

**తెలంగాణ బ్యూరో** : అఫ్గానిస్తాన్ పై పాకిస్తాన్ చేసిన వైమానిక దాడిలో 46 మంది తాలి బాన్లు మరణించారని తాలిబాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి బుధవారం వెల్లడించారు. అఫ్ఘనిస్తాన్లోని తూర్పు సరిహద్దు ప్రావిన్స్ లో ఈ దాడులు జరిగిన ట్లు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి, ప్రావిన్స్లో ని బర్మల్ జిల్లాలో పాకిస్తాన్ నాలుగు ప్రదేశాల్లో బాంబు దాడులు చేసింది. మరణించిన వారిలో ఎక్కువగా పిల్లలు, మహిళలే ఉన్నారని తాలిబన్ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ తెలిపారు. మరో ఆరుగురు గాయపడ్డారని, వారిలో ఎక్కువ మంది చిన్నారులే ఉన్నారని చెప్పారు. ముఖ్యంగా రెండు దేశాల సరిహద్దుల్లో ఉన్న ఖైబర్ ఫఖ్తుంఖ్వా ప్రావి న్సులో దాడులు చేస్తున్నారు. ఆఫ్ఘాన్ తెహ్రీక్ఇతాలి బన్ పాకిస్తాన్(టీటీపీ)కి ఆశ్రయం ఇస్తుందని పాక్ ప్రధాన ఆరోపణ. ఇటీవల తాలిబాన్లు ఆర్మీ ఔట్ పోస్టుపై దాడి చేసి 16 మంది పాక్ ఆర్మీ జవాన్లను హతమార్చారు. ఈ ఘటన జరిగిన కొన్ని రోజుల తర్వాత అఫ్గానిస్తాన్ పై పాకిస్తాన్ ఎయిర్ స్ట్రైక్స్ చేసింది.



## సమగ్ర శిక్ష ఉద్యోగులను ఎందుకు నిర్బంధించారు

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు
- ఎక్స్ లో పోస్టు చేసిన ఎమ్మెల్యే

**తెలంగాణ బ్యూరో** : రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులను ని ర్బంధించడం పట్ల మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్ అయ్యారు. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామిని సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ మెదక్ పట్టణంలో శాంతియుతం గా నిరసన తెలియజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను పోలీస్ స్టేషన్ తరలించి, నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు హరీష్ రావు. 'సమగ్ర శిక్ష ఉద్యోగుల టెంట్ల ముందు నుంచే వెళ్తున్న ముఖ్యమం త్రి గారూ... టెంట్లు పీకేయడం కాదు, వారి సమస్యకు పరిష్కారం చూపండి. 15 రోజులుగా ఆందోళన చే స్తున్న వారి ఆవేదన అర్థం చేసుకోండి.' అని హరీష్ రావు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.



## భువనగిరి వద్ద ఘోర ప్రమాదం.. ఇద్దరు దుర్మరణం

**తెలంగాణ బ్యూరో** : యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. భువనగిరి - బొమ్మపల్లి చౌరస్తాలో ఓ ఇన్నోవా కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డు ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాని కి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదే హాలను స్వాధీనం చేసుకున్నారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ఈ ఆరుగురు యాదగిరిగుట్ట దర్శనం అనంతరం హైదరాబాద్‌కు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.





# ఏ ఆహారంతో ఎలాంటి విటమిన్లు అందుతాయి

మనం ఆరోగ్యకరమైన జీవనం పొందాలంటే పోషకాలు పుష్కలంగా ఉండే ఆహారం తీసుకోవాలి. వాటిలో విటమిన్లు అన్ని శరీరానికి సరిపడా అందితేనే మనం ఆరోగ్యంగా ఉండగలుగుతాం. ప్రతి విటమిన్ కూడా మన ఆరోగ్యానికి ఎంతో సహకరిస్తాయి. ఏ విటమిన్ స్థాయిలు లోపించినా సరే అవి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కొన్ని విటమిన్లు లోపించడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తే, మరికొన్ని విటమిన్ల వల్ల మనకు అర్థంకాని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. జుట్టు రాలడం, జుట్టు తెల్లబడటం, చర్మం పొడిబారడం, కీళ్ల నొప్పులు రావడం, రోగనిరోధక శక్తి క్షీణించడం ఇలా మరెన్నో ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. చాలా మందికి విటమిన్ లోపం ఉందని తెలిసినప్పటికీ ఎటువంటి ఆహారం తినడం ద్వారా ఆ లోపాన్ని పూడ్చుకోగలం అన్న విషయం తెలియక సతమతమవుతుంటారు. ఈ క్రమంలోనే శరీరానికి అన్ని రకాల విటమిన్లు అందాలంటే ఏం చేయాలి? ఏ విటమిన్లతో ఎటువంటి ఆరోగ్యA ప్రయోజనాలు ఉంటాయి? వాటిని పొందాలంటే ఏం తినాలి? విటమిన్లు అన్నీ అందేలా చూసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలేంటి? అన్న విషయాలు తెలుసుకుందాం..

విటమిన్ "A": రేచీకటి, అంధత్వం వంటి సమస్యలను దూరం చేయడంలో విటమిన్ 'ఏ' అద్భుతంగా దోహపడుతుంది. మన కంటి చూపును కూడా మెరుగుపరుస్తుంది. ఇవి చర్మం, జుట్టుకు కూడా మేలు చేస్తుంది. మన రోగనిరోధక శక్తి బలపరుస్తుంది. దీనిని క్యారెట్, చిలగడదుంప, పాలు, బొప్పాయి, ఆకు కూరల ద్వారా పొందవచ్చు.

విటమిన్ B1 (థయామిన్): బీ1 విటమిన్ మన కండరాలను దృఢంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది తృణధాన్యాలు, పప్పులు, డ్రై ఫ్రూట్స్‌లో పుష్కలంగా లభిస్తుంది. బీ1 విమిన్ మనకు తక్షణ శక్తిని అందిస్తుంది.

విటమిన్ B2 (రిబోఫ్లేవిన్): విటమిన్ B2 సమృద్ధిగా ఉన్న ఆహారాన్ని తినడం వల్ల చర్మం, కళ్ళు, జుట్టుకు అవసరమైన పోషణ లభిస్తుంది. ఇది ఎర్ర రక్త కణాలను తయారు చేస్తుంది. పాలు, పెరుగు, పచ్చి కూరగాయలలో బాగా లభిస్తుంది.

విటమిన్ B3 (నియాసిన్): విటమిన్ B3 వల్ల మన జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. మన చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కూడా సహాయపడుతుంది. శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రిస్తుంది. ఇది చేపలు, గుడ్లు, చికెన్, తృణధాన్యాలలో లభిస్తుంది.

విటమిన్ B5 (పాంతోతేనిక్ యాసిడ్): విటమిన్ B5 శరీరంలో హార్మోన్లను తయారు చేయడంలో సహాయపడుతుంది. ఒత్తిడిని తగ్గించడంలోనూ, శక్తిని పెంచడంలోనూ ప్రభావవంతంగా పనిచేస్తుంది. దీనిని గుడ్లు, చేపలు, పప్పులను తినడం ద్వారా పొందొచ్చు.

విటమిన్ B6 (పిరిడాక్సిన్): అరటి, చేపలు, చికెన్లో విటమిన్ బి6 పుష్కలంగా ఉంటుంది. ఇది నాడీ వ్యవస్థను, మెదడును ఆరోగ్యంగా ఉంచుతుంది. జ్ఞాపక శక్తినీ పెంచుతుంది.



విటమిన్ B7: ఈ విటమిన్ మన జుట్టును బలంగా, మెరిసేలా చేస్తుంది. ఇది చర్మాన్ని కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. గింజలు, విత్తనాలు, గుడ్లలో విటమిన్ బీ7 బాగా లభిస్తుంది.

విటమిన్ B9: గర్భధారణ సమయంలో శిశువు మెదడు, వెన్నుపాము అభివృద్ధికి ఈ విటమిన్ సహాయపడుతుంది. అంతేకాకుండా రక్తహీనతను దూరం చేస్తుంది. బచ్చలికూర, బ్రకోలీ, నారింజలో విటమిన్ బీ9 ఎక్కువగా ఉంటుంది.

విటమిన్ B12: ఇది శరీరంలో ఎనర్జీ లెవెల్ పెంచడంలో సహాయపడుతుంది. చేపలు, పాలు, గుడ్లలో ఇది ఎక్కువగా లభిస్తుంది.

విటమిన్ "C": విటమిన్ సీ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇది చర్మాన్ని మెరిసేలా కూడా చేస్తుంది. ఎలాంటి గాయమైనా త్వరగా మాన్పించే గుణం విటమిన్ 'సీ'కి ఉంది. నారింజ, నిమ్మ, ఉసిరి, బెర్రీస్, కివి, టమాటా, నల్ల ఎండుద్రాక్షలలో ఇది పుష్కలంగా ఇది కనిపిస్తుంది.

విటమిన్ "D": ఈ విటమిన్ మన ఎముకలు, దంతాలను బలంగా ఉండేలా చేస్తుంది. శరీరంలో కాల్షియం లోపాన్ని భర్తీ చేసుకోవచ్చు. ఈ విటమిన్‌ను సూర్యరశ్మి ద్వారా పొందవచ్చు. పాలు, చేపలలో కూడా ఇది లభిస్తుంది.

విటమిన్ "E": అందంగా కనిపించాలనుకునే వారు తమ ఆహారంలో విటమిన్ ఇ అధికంగా ఉండే పదార్థాలను చేర్చుకోవాలి. ఈ విటమిన్ చర్మం, జుట్టుకు చాలా ఉపయోగకరం. బాదం, వాల్నట్, పొద్దుతిరుగుడు విత్తనాలలో అధిక మొత్తంలో విటమిన్ "ఇ" ఉంటుంది.

విటమిన్ "K": శరీరంలో రక్తం గడ్డకట్టడాన్ని నివారిస్తుంది. ఎముకలను కూడా దృఢంగా చేస్తుంది. ఆకు కూరలు, సోయాబీన్, బ్రకోలీలో పుష్కలంగా ఇది లభిస్తుంది.





ఉసిరితో అద్భుతమైన లాభాలు

# పొందండిలా..

భూమిపై పెరిగే ప్రతి చెట్టు, ప్రతి పండు, కాయలు అన్నీ కూడా అద్భుతమైన ఔషధ గుణాలు ఉన్నాయని ఆయుర్వేదం చెప్తుంది. అందులోనూ ఉసిరి అందించే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావని, అందుకే దీనిని ఆయుర్వేదం అమృత ఫలంగా చెప్తుందని నిపుణులు అంటున్నారు. ఉసిరిని పచ్చిగా తిన్నా, జ్యూస్ చేసుకుని తాగినా అన్ని లాభాలో పొందొచ్చని చెప్తున్నారు. ప్రతి రోజూ ఒక్కసారైన దీనిని సేవిస్తే అనేక అనారోగ్యాలు దూరమవుతాయి. అయితే ఉదయాన్ని పరగడుపున ఉసిరి జ్యూస్ తాగితే మరిన్ని లాభాలు పొందొచ్చని వైద్యులు చెప్తున్నారు. మధుమేహం ఉన్నవారిలో ఇది చికిత్సాపరంగా పనిచేస్తుంది. క్రోమియం ఇన్సులిన్ ఉత్పత్తి చేయడానికి కొన్ని కణాలకు సహాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. ఇది అదనపు గ్లూకోజ్ కంటెంట్‌ను ఉపయోగించుకునేలా శరీరాన్ని ప్రేరేపిస్తుంది. ఇది జీవక్రియ శక్తిని పొందేందుకు అనుమతిస్తుంది. ఖాళీ కడుపుతో ఉసిరి రసం తాగడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. క్రోమియం గుండె సరిగ్గా పనిచేయడానికి సహాయపడుతుంది. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది.

**జీవక్రియకు:** ఉసిరి రసం శరీరంలో జీవక్రియను పెంచి కొవ్వును కరిగిస్తుంది. ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా బరువు తగ్గేందుకు సాయపడుతుంది. శరీరంలోని ప్రోటీన్ మొత్తాన్ని పెంచుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిని అదుపులో ఉంచుతుంది.

**టాక్సిన్స్ ఔట్:** ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఉసిరి రసాన్ని తీసుకోవడం వల్ల కలిగే మరో ప్రయోజనం ఏమిటంటే ఇది శరీరంలోని టాక్సిన్స్‌ను బయటకు పంపుతుంది. ఇది తరచుగా మూత్రవిసర్జనకు దారితీస్తుంది. మూత్రవిసర్జన చేయడం వల్ల శరీరంలోని విషపదార్థాలు బయటకు పోతాయి. శరీరం నుండి అదనపు నీరు, ఉప్పు, యూరిక్ యాసిడ్, రాళ్లను విసర్జించడంవంటి వాటికి ఉపయోగపడుతుంది. మూత్రపిండాలు, మూత్ర నాళాలకు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మూత్రాశయ ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది.

**విటమిన్ సి:** ఉసిరిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఖాళీ కడుపుతో జామకాయ రసాన్ని తాగడం వల్ల మీకు మరిన్ని ప్రయోజనాలు లభిస్తాయి. కడుపులో ఆమ్ల స్థాయిని పెంచుతుందని మీరు గమనించాలి. కొందరి పొట్టలు చాలా సున్నితంగా ఉంటాయి. అలాంటి వారు తీసుకోకుండా ఉంటే మంచిది.

**పోషకాలు గ్రహించవచ్చు:** ఉసిరి రసం కొన్ని పోషకాలను గ్రహించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అదేవిధంగా ఉసిరి కాల్షియం గ్రహించడంలో సహాయపడుతుంది. కాల్షియం ప్రధానంగా ఎముకలు, దంతాలు, గోళ్లకు అవసరం. ఈ రసాన్ని తాగడం వల్ల ఆహారంలోని క్యాల్షియం కడుపు సరిగ్గా గ్రహించేలా చేస్తుంది.

**పేగు కదలికలకు:** ఉసిరి రసం పేగు కదలికలను సులభతరం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని చెబుతారు. ఇది కడుపు నొప్పిని తగ్గిస్తుంది. పేగు కదలికలు సాఫీగా జరగడానికి సహాయపడుతుంది. ఉసిరిలో ఉండే అధిక స్థాయి ఫైబర్ కడుపు సమస్యలను నివారిస్తుంది. పేగుల ద్వారా మలం సక్రమంగా ప్రవహిస్తుంది, పేగు పనితీరు సక్రమంగా ఉంటుంది. గూస్బెర్రీ జ్యూస్ సరైన జీర్ణక్రియ, పేగు ద్వారా ఆహారంలోని అన్ని రకాల పోషకాలను గ్రహించేందుకు సాయపడుతుంది.



**వాపును తగ్గిస్తుంది**

ఉసిరి సహజ యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంది. ఉసిరి రసం శరీరంలో తెల్ల రక్త కణాలను పెంచుతుంది. ఇది శరీరాన్ని ప్రభావితం చేసే కొన్ని బాహ్య కణాలు, జెర్మ్స్‌తో పోరాడుతుంది. రక్తనాళాలలో ఉండే విషపూరిత మూలకాలను తొలగిస్తుంది. ఉసిరి రసం ఇన్ఫెక్షన్ వల్ల ఏర్పడే వాపు, మంటను తగ్గిస్తుంది.

**వారు మాత్రం దూరం పాటించాల్సిందే:** మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఉసిరి మేలు చేస్తుంది. అయితే మధుమేహ వ్యాధిగ్రస్తులకు డాక్టర్ సూచించిన మందులతో పాటు ఈ రసం తాగడం వల్ల మందులపై ప్రభావం చూపుతుంది. దీని కారణంగా హైపోగ్లైసీమియా అంటే రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. హైపోగ్లైసీమియా ప్రాణాంతకం కావచ్చు. మీరు మధుమేహం కోసం మాత్రలు తీసుకుంటే మీ వైద్యుడిని సంప్రదించిన తర్వాత ఉసిరి రసం తాగడం మంచిది. ఉసిరి రసం తాగడం వల్ల వచ్చే మరో ఆరోగ్య సమస్య అలర్జీ. మీకు ఎలాంటి సమస్యలు లేకుండా తీసుకోవచ్చు.



# బిజినెస్
BUSINESS

## బీమా పాలసీలకు కిరాణా దుకాణాల అండ!



చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాల్లో యూపీఐ లావాదేవీలు ఈ ఏడాది 33% పెరిగాయని ఓ నివేదిక తెలిపింది. యూపీఐ చెల్లింపుల సౌలభ్యం ఉన్న విక్రయ కేంద్రాల ద్వారా బీమా కొనుగోళ్లు, ప్రీమియం వసూళ్ల లావాదేవీల సంఖ్య 127% పెరగ్గా, కొత్త వినియోగదార్ల సంఖ్యలో 97% శాతం వృద్ధి ఉందని పేనియర్‌బై రూపొందించిన నివేదిక తెలిపింది. గ్రామీణ, చిన్న పట్టణాల్లోని ఆర్థిక, డిజిటల్ సేవలు అందిస్తున్న 10,00,000 చిన్న విక్రయ కేంద్రాల (కిరాణా దుకాణం, మొబైల్ రీఛార్జ్ కేంద్రాలు లాంటివి) నుంచి సేకరించిన లావాదేవీల వివరాల ఆధారంగా ఈ విశ్లేషణ చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు నమోదైన వ్యాపార గణాంకాలను, గతేడాది ఇదే సమయంతో పోల్చి ఈ నివేదిక రూపొందించారు. దేశవ్యాప్తంగా బీమా వ్యాప్తికి ఎదురవుతున్న అవరోధాలను అధిగమించడంలో ఇలాంటి విక్రయ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నివేదిక వివరించింది.

వ్యాపార రుణాలు, పసిడి రుణాలు, వ్యక్తిగత రుణాల వంటి రుణ ఉత్పత్తుల లావాదేవీల సంఖ్య 297% పెరిగింది. గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాల్లో రుణాలపై అవగాహన, గిరాకీ పెరుగుతుండటాన్ని ఇది తెలియజేస్తోంది

ఈ ఏడాది మైక్రో ఏటీఎం, ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థల (ఏఈపీఎస్) ద్వారా నగదు ఉపసంహరణ తగ్గింది. వీటి నుంచి ఒక్కో లావాదేవీ ద్వారా సగటు నగదు ఉపసంహరణ 2023లో రూ.2,624 కాగా.. 2024లో రూ.2,482కు తగ్గింది.

ఈ ఏడాది మిగతా సమయంతో పోలిస్తే, ప్రభుత్వం నుంచి పథకాల కింద ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) జరుగుతున్న సమయంలో ఏఈపీఎస్ ద్వారా నగదు ఉపసంహరణ 35 45% అధికంగా ఉంది. ముఖ్యంగా పీఎం కిసాన్ యోజన లాంటి పథకాల సమయంలో ఈ ధోరణి కనిపించింది.

## రూ.26,999లకే ఐఫోన్ 15..

### అనూహ్య ఆఫర్ ప్రకటించిన ఫ్లిప్‌కార్ట్

* **యాపిల్ ఐఫోన్ 15 బ్లాక్ వేరియెంట్‌పై భారీ డిస్కౌంట్ ఆఫర్**
* **డీల్ డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ ఆఫర్లతో కలుపుకొని రూ.26,999లకే ఐఫోన్**
* **టెక్ ప్రియులకు అదిరిపోయే ఆఫర్ ప్రకటించిన ఫ్లిప్‌కార్ట్**



ఐఫోన్ కొనుగోలు చేసేందుకు బెస్ట్ డిస్కౌంట్ డీల్స్ కోసం ఎదురుచూస్తున్న టెక్ ప్రియులకు గుడ్‌న్యూస్ వచ్చింది. ప్రముఖ ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ ఊహించని ఆఫర్ ప్రకటించింది. యాపిల్ ఐఫోన్ 15పై (128GB, బ్లాక్ వేరియంట్) ఊహించని డీల్‌ను ప్రకటించింది. రూ.69,990 విలువైన ఫోన్‌ను రూ.26,999లకే అందిస్తోంది. డీల్ డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ ఆఫర్లతో కలుపుకొని ఈ భారీ తగ్గింపు లభిస్తోంది. గతంలో ప్రకటించిన అన్ని డిస్కౌంట్ ఆఫర్ల కంటే ఇదే అత్యుత్తమంగా ఉంది. ఎక్స్ఛేంజ్‌లో గరిష్ఠంగా రూ.31,500 వరకు ఆదా చేసుకునే అవకాశాన్ని ఫ్లిప్‌కార్ట్ కల్పించింది. ఎక్స్ఛేంజ్ ఆఫర్ మినహాయింపుతో అయితే గరిష్ఠంగా 16 శాతం తగ్గింపుతో రూ.58,499కు ఫోన్ లభిస్తోంది. కాగా, ఐఫోన్ 15 సెప్టెంబర్ 2023లో విడుదలైంది.

**ఐఫోన్ 15 ఫీచర్లు ఇవే**

ఈ ఫోన్ 6.1అంగుళాల స్క్రీన్‌తో, 2000 నిట్స్ గరిష్ఠ బ్రైట్‌నెస్, క్వాడ్‌పిక్సెల్ సెన్సార్‌తో కూడిన 48 MP ప్రైమరీ కెమెరా ప్రత్యేక ఫీచర్లుగా ఉన్నాయి. ఫొటోలు హై రిజల్యూషన్‌తో వస్తాయి. యూఎస్‌బీసీ కనెక్టివిటీ ఛార్జింగ్ సదుపాయం ఉంది. దీని ద్వారా డేటా ట్రాన్స్‌ఫర్ కూడా సులభంగా చేసుకోవచ్చు. ఏ16 బయోనిక్ చిప్ సపోర్ట్‌తో పనితీరు స్పీడ్‌గా ఉంటుంది.

## త్వరలో వన్‌ప్లస్ 13 ఎంట్రీ.. వన్‌ప్లస్ 12పై భారీ డిస్కౌంట్

టెక్ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న వన్‌ప్లస్ 13 వచ్చే రెండు వారాల్లో దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో వన్‌ప్లస్ 12 ధరను వన్‌ప్లస్ తగ్గించింది. ఇ కామర్స్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ (Amazon)లో ఎంపిక చేసిన కార్డు ద్వారా వన్‌ప్లస్ 12 స్మార్ట్‌ఫోన్‌ను రూ.53వేల లోపే కొనుగోలు చేయొచ్చు. వన్‌ప్లస్ 12.. 12జీబీ + 128జీబీ బేస్ వేరియంట్ ధర రూ.64,999గా కంపెనీ నిర్ణయించింది. ప్రస్తుతం అమెజాన్ ఈ మొబైల్‌పై 8 శాతం రాయితీ అందిస్తోంది. అంటే రూ.5 వేలు తగ్గింపుతో రూ.59,999కే విక్రయిస్తోంది. దీంతోపాటు ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డ్, వన్ కార్డ్‌తో కొనుగోలు చేస్తే ఏకంగా రూ.7 వేలు ఫ్లాట్ డిస్కౌంట్ లభిస్తుంది. పూర్తి మొత్తాన్ని చెల్లించకుండా ఈఎంఐ ఎంపిక చేసుకున్నవారికి కూడా ఇదే వెసులుబాటు కల్పిస్తోంది. ప్రస్తుతం అమెజాన్ 3, 6, 9 నెలల పాటు ఈఎంఐ ఆప్షన్లు ఎంచుకొనే సదుపాయం ఉంది. ఇలా అమెజాన్ ఇస్తున్న అన్ని ఆఫర్లు కలుపుకుంటే వన్‌ప్లస్ 12 రూ.52,999కే కొనుగోలు చేయొచ్చన్నమాట. వన్‌ప్లస్ 12 ఫోన్ ఫీచర్ల విషయానికొస్తే.. ఇందులో 6.82 అంగుళాల క్వాడ్ హెచ్‌డీ + ఎల్‌టీపీఓ 4.0 అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. ఇది 120Hz రీఫ్రెష్ రేట్, 4,500 పీక్ బ్రైట్ నెట్ ఇస్తుంది. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 8జెన్ 3 ప్రాసెసర్‌తో తీసుకొచ్చారు. ఆండ్రాయిడ్ 14 ఆధారిత ఆక్సిజన్ ఓఎస్ 14తో పనిచేస్తుంది.



50 ఎంపీ, 48 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్, 64 ఎంపీ పెరిస్కోప్ టెలిఫొటో జూమ్ లెన్స్, 32 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 5,400mAh బ్యాటరీతో 100W సూపర్‌వూక్ ఫాస్ట్ ఛార్జింగ్, 50W వైర్‌లెస్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది.

## ఓలా ఎలక్ట్రిక్ 3,200 కొత్త రిటైల్ స్టోర్లు.. 4వేలకు చేరిన సంఖ్య



ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తన రిటైల్ స్టోర్ల సామర్థ్యాన్ని పెంచింది. దేశవ్యాప్తంగా కొత్తగా 3,200 స్టోర్లను తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ప్రస్తుతం ఉన్న 800 స్టోర్ల సంఖ్య 4 వేలకు పెరిగిందని ఓలా ఎలక్ట్రిక్ సీఈఓ భవీశ్ అగర్వాల్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న తమ నెట్‌వర్క్ సామర్థ్యాన్ని 4,000కు పెంచడంపై భవీశ్ అగర్వాల్ ఆనందం వ్యక్తం చేశారు. మెట్రో, టైర్ 2, టైర్ 3 నగరాలతో పాటు చిన్న పట్టణాలు, మండల కేంద్రాలకూ తమ సర్వీస్ సెంటర్లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఈ సందర్భంగా ఓలా స్కూటర్‌పై అందిస్తున్న ఆఫర్లను ప్రకటించారు. ఓలా ఎస్1 పోర్ట్‌ఫోలియోలోని స్కూటర్లపై రూ.25వేల విలువైన ప్రయోజనాలు అందిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. నెట్‌వర్క్‌ను పెద్ద ఎత్తున విస్తరించిన సందర్భంగా ఈ ఒక్కరోజు (డిసెంబర్ 25) ఈ ఆఫర్‌ను అందిస్తున్నట్లు తెలిపింది.

# టెక్నాలజీ


## ఈ ఏటి మేటి ఫోన్లు!

ఈ సంవత్సరం ఇండియన్ గ్యాడ్జెట్ అవార్డ్స్ పోటీకి 200కు పైగా నామినేషన్లు వచ్చాయి. వీటిల్లోంచి ఉత్తమమైన వాటిని పరిశ్రమ నిపుణులు, డిజైనర్లు, టెక్ పాత్రికేయులతో కూడిన న్యాయనిర్ణేతల బృందం ఎంపిక చేసింది. వాటిల్లో కొన్నింటి గురించి తెలుసుకుందాం.

ఉత్తమ ఫోన్ (రూ.10వేల లోపు): చవక ఫోన్లు బోలెడన్ని వచ్చిన నేపథ్యంలో ఈ విభాగంలో విజేత ఎంపిక కష్టంగానే అనిపించింది. చివరికి ఇన్‌ఫినిక్స్ హాట్ 50 5జీ విజేతగా నిలిచింది. వేగవంతమైన మీడియాటెక్ హీలియో జీ81 ప్రాసెసర్, భారీ 5,000ఎంఏహెచ్ బ్యాటరీ, నునుపైన 120హెచ్‌జడ్ డిస్‌ప్లే వంటి ఫీచర్లతో కట్టిపడేసింది.

ఉత్తమ ఫోన్ (రూ.15వేల లోపు): ఈ విభాగంలో 5జీతో అతి వేగవంత ఇంటర్నెట్ అనుభూతిని కలిగిస్తున్న బడ్జెట్ ఫోన్లు చాలానే వచ్చాయి. చివరికి రెడ్‌మీ 13 5జీ ముందు నిలిచింది.

వీఎఫ్ఎం (రూ.20వేల లోపు): ఇందులో సీఎంఈ ఫోన్ 1 విజేతగా ఎంపికైంది. సూపర్ క్లీన్ సాఫ్ట్‌వేర్, పెద్ద 120హెచ్‌జడ్ ఎమోలెడ్ డిస్‌ప్లే, విశ్వసనీయమైన చిప్‌సెట్ వంటి ఫీచర్లు



న్యాయ నిర్ణేతలను ఆకట్టుకున్నాయి.

మెయిన్‌స్ట్రీమ్ (రూ.25వేల లోపు): వన్‌ప్లస్, నథింగ్, వివో, రెడ్‌మీ వంటివన్నీ పోటీ పడినప్పటికీ మోటరోలా ఎడ్జ్ 50 ఫ్యూజన్ ఉత్తమంగా ఎంపికైంది. స్లిమ్‌గా ఉండటం, స్థిరమైన సామర్థ్యం, సునాయాస సాఫ్ట్‌వేర్ అనుభూతి వంటివి దీన్ని భిన్నంగా నిలిపాయి.

మిడ్ ప్రీమియం (రూ.35వేల లోపు): టాప్ ఎండ్ ఫ్లాగ్‌షిప్‌లతో సమానంగా మంచి నైపుణ్యం, కెమెరా, హార్డ్‌వేర్లలో సమతూకం పాటించిన ఫోన్లు ఎన్నో పోటీకి వచ్చాయి. ఆఖరికి పోకో ఎఫ్6 కిరీటాన్ని గెలుచుకుంది.

అఫర్డబుల్ ఫ్లాగ్‌షిప్ (రూ.50వేల లోపు): ఈ విభాగంలో 2024లో చాలా ఫోన్లే వచ్చాయి. వివిధ అంశాల్లో వన్‌ప్లస్ 12ఆర్ మిన్నగా నిలిచింది. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 8 జెన్ 2, పటిష్ఠమైన బాడీ, 5500ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్లు ఆకట్టుకున్నాయి.

## మీ పిల్లలకు రోడ్డు యాక్సిడెంట్!

### కొత్త తరహా సైబర్ మోసం.. సజ్జనార్ ట్వీట్

సైబర్ నేరగాళ్లు పెరుగుతున్న టెక్నాలజీని ఆసరాగా చేసుకుని కొత్త కొత్త పద్దతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పించడంతో నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త రకం పద్దతులను తెరమీదకు తీసుకువస్తున్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కుకోకుండా అవగాహన కల్పించే క్రమంలో తాజాగా ఎక్స్ వేదికగా టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మరో ఆసక్తికర విషయం పోస్ట్ చేశారు. కొత్త తరహా సైబర్ మోసం.. జాగ్రత్త అంటూ సజ్జనార్ హెచ్చరించారు. 'మీ పిల్లలు రోడ్డు యాక్సిడెంట్‌కు గురయ్యారని తల్లిదండ్రులకు సైబర్ నేరగాళ్ల ఫోన్ కాల్స్ చేస్తారు. హాస్పిటల్‌లో ఎమర్జెన్సీ వార్డులో ఉన్నారని, తక్షణమే సర్జరీ చేయాలంటూ మాయమాటలు చెబుతారు. సర్జరీ కోసం వెంటనే డబ్బులు పంపాలంటూ కేటుగాళ్ళు లింకులను షేర్ చేస్తారు. ఆ లింకులను క్లిక్ చేయగానే బ్యాంక్ ఖాతాల నుంచి నగదును గుల్ల చేస్తున్న మోసగాళ్ళు, ఇలాంటి మోసపూరిత ఫోన్ కాల్స్‌కి స్పందించొద్దు. సైబర్ మోసాలపై కేంద్ర హోంశాఖ హెల్ప్‌లైన్ నెంబర్ 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేయండి' అని పేర్కొన్నారు.



## ఉష్ణోగ్రతను బట్టి రంగులు మార్చే స్మార్ట్ ఫోన్..




రియల్‌మీ 14 ప్రో సిరీస్ జనవరి 2025లో భారతదేశంలో లాంచ్ కానుంది. అధునాతన టెక్నాలజీతో ఈ ఫోన్‌ను కంపెనీ విడుదల చేయనుంది. వివిధ నివేదికల సమాచారం ప్రకారం.. ఇది ప్రత్యేకమైన రంగును మార్చే బ్యాక్ డిజైన్‌ను కలిగి ఉంటుంది. ఈ వెనుక ప్యానెల్ అధునాతన థర్మోక్రోమిక్ పిగ్మెంట్‌లతో తయారు చేసి ఉంటుంది. ఇవి ఉష్ణోగ్రతలో మార్పులతో వాటి రంగును మారుస్తాయి. ఉష్ణోగ్రత 16°C కంటే తక్కువగా పడిపోయినప్పుడు, వెనుక కవర్ పెర్ల్ వైట్ నుండి వైబ్రెంట్ బ్లూకి మారుతుంది. ఉష్ణోగ్రత పెరిగేకొద్దీ అది మళ్లీ అదే రంగులోకి మారుతుంది. Realme 14 Pro సిరీస్‌లో యూనిక్ పెరల్ డిజైన్ ఉంటుంది. దీనిలో పెర్ల్ వైట్ వేరియంట్ ప్రత్యేక ఆకృతిని కలిగి ఉంటుంది. ఈ ఆకృతి సీషెల్ పౌడర్ నుండి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ స్మార్ట్‌ఫోన్ చాలా స్లిమ్‌గా ఉంటుంది. ఇది 8 మిమీ కంటే తక్కువ క్వాడ్‌వంపు ప్రొఫైల్, మిరుమిట్లు గొలిపే ముత్యం లాంటి షైన్‌ను కలిగి ఉంటుంది. ప్రతి ఫోన్ వెనుక ప్యానెల్‌పై భిన్నమైన నమూనా ఉంటుంది. ఇది సహజమైన సముద్రపు షెల్‌ల వలె కనిపిస్తుంది. అదనంగా ఈ శ్రేణి ఒక ప్రత్యేకమైన నమూనా ఉంటుంది. ఇది 30 డిగ్రీల "ఫ్యూజన్ ఫైబర్" ప్రక్రియ ద్వారా దీనిని తయారు చేశారు. ఇందులో 95% పర్యావరణ అనుకూలమైన, బయో ఆధారిత పదార్థాలను ఉపయోగించారు. ఈ డిజైన్ వర్క్స్ కారణంగా, స్మార్ట్‌ఫోన్ లుక్ పూర్తిగా భిన్నంగా ఉంటుందట. ఇది వినియోగదారుకు ప్రీమియం అనుభవాన్ని ఇస్తుందని టెక్ వర్గాలు చెబుతున్నాయి.



# నవీన్ పోలిశెట్టి పెళ్ళి.. బంగారు పళ్ళెంలో భోజనం

నవీన్ పోలిశెట్టి.. ఈపేరుకు పరిచయం అక్కర్లేదు. ఇండస్ట్రీలోకి హీరోగా ఎంట్రీ ఇచ్చిన తొలి సినిమా నుంచే ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక బజ్ సృష్టించుకున్నాడు. తన కామెడీ టౌమింగ్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. నవీన్ హీరోగా ఒక సినిమా చేస్తున్నాడంటే దానికి ముందుగా పెద్దగా హైప్ ఉండకపోవచ్చు. కానీ ప్రమోషన్స్ బాధ్యతలు అన్నీ తానే తీసుకొని సినమాను కొద్దిరోజుల్లోనే అందరికీ రీచ్ అయ్యేలా చేస్తాడు ఈ యంగ్ హీరో. నవీన్ పోలిశెట్టి నటించాల్సిన అప్‌కమింగ్ సినిమాల్లో 'అనగనగా ఒక రాజు' కూడా ఒకటి. ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను చాలాకాలం క్రితమే విడుదల చేశారు మేకర్స్. కానీ అప్పటినుండి ఇప్పటివరకు ఈ మూవీ గురించి ఇంకా ఎలాంటి అప్డేట్ లేదు. దీంతో ఈ సినిమా అటకెక్కింది అనే వార్తలు కూడా వచ్చాయి. దాదాపు ఈ మూవీని ప్రేక్షకులంతా మర్చిపోయే సమయంలో ఒక ప్రీ వెడ్డింగ్ టీజర్ కోసం సిద్ధంగా ఉండండి అంటూ మేకర్స్ పిలుపునిచ్చారు. రాజుగారి పెళ్లి సందడి మొదలు అంటూ 'అనగనగా ఒక రాజు' మూవీ నుండి మరొక ఫన్నీగ్లింప్స్ విడుదలయ్యింది. అయితే ఈ గ్లింప్స్‌లో రాజుగారు అలియాస్ నవీన్ పోలిశెట్టి ఫేస్‌ను రివీల్ చేయలేదు. డిసెంబర్ 26న ప్రీ వెడ్డింగ్ టీజర్ వచ్చేస్తుంది అంటూ ఈ వీడియో చివర్లో క్లారిటీ ఇచ్చారు మేకర్స్. ఇప్పటివరకు ఎంతోమంది యంగ్ హీరోలకు మంచి కథలతో హిట్ అందించిన సితార ఎంటర్‌టైన్మెంట్స్.. 'అనగనగా ఒక రాజు'ను కూడా నిర్మించడానికి సిద్ధమయ్యింది. కానీ ఈ మూవీకి దర్శకుడు ఎవరు అని మాత్రం ఇంకా రివీల్ చేయలేదు.

# పెళ్ళాం సంపాదనతో 15ఏళ్లు బతికాడు



బాలీవుడ్ స్టార్ నటుడు బాబీ డియోల్‌పై టాలీవుడ్ డైరెక్టర్ బాబీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. దాదాపు 15 ఏళ్ల పాటు సినిమా అవకాశాలు రాకపోవడంతో ఇంట్లో కూర్చుని భార్య సంపాదన బతికాడంటూ కీలక విషయాలు చెప్పాడు. జూనియర్ ఎన్‌టీఆర్‌కు జై లవకుశ, మెగాస్టార్ చీరుకు వాల్తేరు వీరయ్యతో హిట్స్ అందించిన బాబీ.. ప్రస్తుతం బాలయ్యతో 'డాకు మహారాజ్' సినిమా తెరకెక్కిస్తున్నాడు. ఇందులో బాలయ్యకు విలన్‌గా బాలీవుడ్ నటుడు బాబీ డియోల్‌ను తీసుకొచ్చాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న బాబీ.. బాబీ డియోల్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. "యానిమల్ సినిమాకు ముందే 'డాకు మహారాజ్' థను బాబీకి చెప్పాను. ఆ సినిమా రిలీజ్ అయిన వెంటనే ఈ ప్రాజెక్ట్‌లో జాయిన్ అయ్యాడు. కానీ దాని వెనక చాలా ఎమోషనల్ జర్నీ ఉంది. ఒకానొక సమయంలో తన కొడుకు నాన్న ఇక పని చేయడా అని వాళ్ల భార్యతో అన్న మాటలు విని ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడట. సినిమా అవకాశాలు రాక దాదాపు 15 సంవత్సరాలు ఇంట్లోనే కూర్చుని ఉన్నాడు. ఆ సమయంలో భార్య సంపాదనతోనే బతికాడు. ఆ సమయంలో ఒక తెలుగు వ్యక్తి సందీప్ రెడ్డి వ ంటాడు. ఇప్పుడు బాబీ డియోల్‌కు అడిగినంత రెమ్యూనరేషన్ ఇవ్వడానికి నిర్మాతలు సిద్ధంగా ఉన్నారు" అని డైరెక్టర్ బాబీ చెప్పుకొచ్చాడు.

# పీఆర్ మేనేజర్లకు షాకిచ్చిన చిరు



తన పర్సనల్ రిలేషన్ మేనేజర్లు జీకే మోహన్, బాబీలకు మెగాస్టార్ చిరంజీవి భారీ షాకిచ్చారు. వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు వెల్లడించారు. చిరంజీవి తీసుకున్న ఈ షాకింగ్ డెసిషన్ సంబంధిత వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆర్థిక వ్యత్యాసాల కారణంగానే చిరు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సన్నిహిత వర్గాలు చెప్తున్నాయి. వీరిని వెంటనే విధుల నుంచి తొలగిపోవాలని చిరు ఆదేశించినట్లు సమాచారం. రీసెంట్ ఇయర్స్ లో చిరు పర్సనల్, ప్రొఫెషనల్ అకౌంట్స్ కి సంబంధించిన డాక్యుమెంటేషన్ లో అనేక పొరపాట్లు కనబడినట్లు గ్రౌండ్ స్టాఫ్ చిరు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విచారణ చేపట్టగాజీకే మోహన్, బాబీల అక్రమాలు ఉన్నట్లు గుర్తించారు. చిరు వీటిపై ఆరా తీయగా వారు సమాధానం ఇవ్వలేకపోయారు. దీంతో వెంటనే జీకే మోహన్, బాబీలను ఉద్యోగాల నుండి తొలిగించినట్లు సమాచారం. అంతేకాక జీకే మోహన్ తెలుగు రియాలిటీ షో బిగ్ బాస్ లో పాల్గొన్న ప్రముఖ కంటెస్టెంట్‌తో ఎఫైర్ కొనసాగిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆయనను జాబ్ నుంచి తొలిగించటానికి ఇది కూడా ఒక కారణంగా చెప్పుకుంటున్నారు.



# క్రిస్మస్ వేడుకల్లో మెరిసిన శృతి హాసన్

క్రిస్మస్ వేడుకలను చాలా మంది సెలబ్రిటీలు ఔరా అనేలా నిర్వహించారు. క్రిస్మస్ ట్రీతో, క్రిస్మస్ హ్యాట్, సాంటా క్లాజ్‌లో ఫొటోలు దిగి సోషల్ మీడియా వేదికగా ఫ్యాన్స్‌తో షేర్ చేసుకున్నారు. వీరిలో శృతి హాసన్ అందరినీ కట్టిపడేసింది. గోత్ థీమ్‌తో క్రిస్మస్‌ను సెలబ్రేట్ చేయటానికి తన స్టైల్‌ను జోడించింది శృతీ హాసన్. తనదైన స్టైల్లో యూనిక్‌గా నిర్వహిస్తోన్న క్రిస్మస్ పండుగ వేడుకలకు సంబంధించిన ఫొటోలను తన సోషల్ మీడియాలో షేర్ చేసింది. ప్రత్యేకమైన శైలిలో హాలీడే సీజన్‌కు స్వాగతం పలుకుతూ ఆమె అభిమానులు సహా అందిరలోనూ ఆనందాన్ని నింపింది. ఇక సినిమాల విషయానికి వస్తే 2023 శ్రుతీ హాసన్ కెరీర్‌లో బ్లాక్ బస్టర్ ఏడాదిగా సాగింది. వాల్తేరు వీరయ్య, వీర సింహారెడ్డి, సలార్ పార్ట్ 1 చిత్రాలు విడుదలై ఘన విజయాలను సాధించాయి. కానీ ఈ ఏడాది మాత్రం ఆమె నటించిన సినిమాలేవీ విడుదల కాలేదు. అయితే అభిమానులు మాత్రం 2025లో సరికొత్త చిత్రాల్లో ఆమెను చూడొచ్చు. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న క్రేజీ పాన్ ఇండియా మూవీ కూలీ వచ్చే ఏడాదిలోనే రిలీజ్ కానుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.